# వాస్తవం

డెయిలీ. కామ్

ఉన్నది ఉన్నట్లుగా

డిజిటల్ పత్రిక

శుక్రవారం 21.08.2026

ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


# కొండాపై ఎదురు దాడి



## కొండా సుస్మితకు సంస్కారం నేర్పండి

**కొండా దంపతులకు కాంగ్రెస్ నేతల హితవు**

**పదవి ఇచ్చిన సీఎంపైనే అనుచిత వ్యాఖ్యలా..?**

**కొండా సురేఖపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందే**

**అధిష్ఠానానికి ఎమ్మెల్యే నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు స్వర్ణ విజ్ఞప్తి**




**హనుమకొండ :** సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రమైన ఆరోపణలు చేసిన కొండా సుస్మిత, ఆమె తల్లి- రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై కాంగ్రెస్ నాయకులు ధ్వజమె త్తారు. ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, తదితరులతో కలిసి రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ గురువారం మీడియాతో మాట్లాడుతూ.. సంస్కారం లేని సుస్మితకు మర్యాద, సంస్కారం నేర్పాలని కొండా దంపతులకు హితవు చెప్పారు. తల్లి సురేఖకు మంత్రి పదవి ఇస్తే కృతజ్ఞత చూపడానికి బదులు సీఎం పై సుస్మిత అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏ సంస్కృతి అని ప్రశ్నించారు. పదవి ఇచ్చిన వారిపైకి ఉసిగొల్పడం సరి కాదన్నారు. మంత్రి కొండా సురేఖపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందేనని కాంగ్రెస్ అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. లేదంటే పార్టీ శ్రేణుల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. స్థాయి మరిచి సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రేవంత్ రెడ్డి బాధ్యతతో పార్టీని గెలిపిస్తే.. అందుకు అధికారంలోని పదేళ్లలో ఎన్నో బాధలు అనుభవించిన కార్యకర్తలు ఎంతో కష్టపడ్డారని గుర్తు చేసిన స్వర్ణ.. ఈ తరుణంలో సుస్మిత వ్యాఖ్యలు అందరిని కలవరానికి గురి చేశాయని ఆందోళన వ్యక్తం చేశారు.పార్టీలు మారిన ఘనత కొండా దంపతులదేనన్న స్వర్ణ.. టీడీపీ.. కాంగ్రెస్, వైఎస్ ఆర్సీపీ.. కాంగ్రెస్.. బీఆర్ఎస్.. తర్వాత కాంగ్రెస్ పార్టీ లోకి వచ్చినా, సీఎం రేవంత్ రెడ్డి గౌరవంతో ఆమెకు మంత్రి పదవి ఇచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ బస్వ రాజు సారయ్య మాట్లాడుతూ.. అడగ్గానే ఇవ్వడానికి ఎమ్మెల్యే టిక్కెట్ ఏమైనా చాక్లెటా, బిస్కెటా అని ప్రశ్నిం చారు. ప్రతీసారీ బీసీ కార్డు ప్రయోగించడం కొండా దం పతులకు పరిపాటేందన్న బస్వరాజు.. తామంతా బీసీలు గా పార్టీలో కొనసాగడం లేదా? అని నిలదీశారు. ఎమ్మె ల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ.. సుస్మిత మాట్లాడిన పుడు అక్కడ ఉన్న కాంగ్రెస్ నేతలపైనా చర్య తీసు కోవాలన్నారు.

# లండన్ చేరుకున్న సీఎం

**అమెరికా పర్యటనకు ఇంకా లభించని కేంద్ర అనుమతి**

**23న అమెరికాలోని బోస్టన్‌కు..**

**29 దాకా పర్యటనకు ప్రణాళిక**

**శుక్రవారం అనుమతులు రావొచ్చంటున్న అధికార వర్గాలు**

**హైదరాబాద్, ఆగస్టు 20 :** సీఎం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు సాంకేతికంగా అడ్డంకులు ఏర్పడ్డాయి. అమెరికాలో ఆయన పర్యటన కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి గురువారం అర్ధరాత్రి వరకు కూడా అనుమతులు రాకపోవడమే కారణం. అయితే శుక్రవారం కేంద్ర అనుమతి వచ్చే అవకాశం ఉందని, రేవంత్ అమెరికా పర్యటన యథాతథంగా కొనసాగుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. సహజంగా దేశంలోని ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా ప్రభుత్వ, ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొనడం కోసం విదేశాలకు వెళ్లాలంటే కేంద్ర ప్రభుత్వం (ప్రధాని, విదేశీ వ్యవహారాలు, ఆర్థిక శాఖల) నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఏవైనా అవాంఛనీయ, ప్రత్యేక పరిస్థితులు నెలకొంటే తప్ప.. సీఎం కార్యాలయం కోరగానే కేంద్రం నుంచి అనుమతులు మంజూరు అవుతాయి. ఈ క్రమంలో ఈనెల 20 నుంచి 29వ తేదీ వరకు బ్రిటన్, అమెరికా దేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన కోసం కేంద్రం అనుమతి కోరుతూ తెలంగాణ సీఎంవో లేఖ రాసింది. అందులో బ్రిటన్ పర్యటనకు కేంద్రం అనుమతి లభించింది. దీంతో బుధవారం అర్ధరాత్రి 12.30 గంటలకు ఢిల్లీ నుంచి సీఎం రేవంత్ లండన్‌కు వెళ్లారు. ఢిల్లీ విమానాశ్రయంలో ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ ఆయనకు వీడ్కోలు పలికారు. అయితే షెడ్యూల్ ప్రకారం.. ఆదివారం(23న) లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు సీఎం వెళ్లాల్సి ఉంది. కానీ గురువారం అర్ధరాత్రి వరకూ కేంద్రం నుంచి అనుమతులు రాకపోవడంతో సందిగ్ధం నెలకొంది. ఒకవేళ అనుమతులు రాకుంటే.. సీఎం రేవం



త్ లండన్ పర్యటన ముగియగానే హైదరాబాద్ తిరిగి రావాల్సి ఉంటుంది. వచ్చే మూడురోజుల్లో శుక్రవారం ఒక్కటే పని దినం ఉందని.. కేంద్రం అనుమతి ఇవ్వాలనుకుంటే.. శుక్రవారంవచ్చే అవకాశం ఉందని సీఎంవో వర్గాలు చెబుతున్నాయి. ఒకవేళ కేంద్రం రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతివ్వని పక్షంలో.. స్వయంగా ప్రధానమంత్రే నిలిపేసినట్టు అవుతుందని రాజకీయ వర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఎమ్మెల్యే టికెట్.. రేవంత్ ప్రకటించినా చెల్లదు

**అభ్యర్థుల ఎంపికలో అధిష్ఠానమే ఫైనల్**

**పీసీసీ చీఫ్ మహేశ్ స్పష్టం**

**కంఠేశ్వర్, ఆగస్టు 20 :** కాంగ్రెస్ పార్టీలో ఒక విధానమంటూ ఉంటుంది.. దాని ప్రకారమే నడుస్తుంది.. ఎమ్మెల్యే టికెట్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినా చెల్లదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టంచేశారు. ఎన్నికల కమిటీ, సీడబ్ల్యూసీ నిర్ణయం ప్రకారమే అభ్యర్థుల ఎంపిక ఉంటుందని తేల్చిచెప్పారు. గురువారం నిజామాబాద్‌లో విలేకరుల వద్ద ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత కామెంట్స్‌పై స్పందిస్తూ.. 'ఆమె వ్యాఖ్యలు బాధాకరం.. తీవ్రంగా ఖండిస్తున్నాం.. ఇప్పటికే కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం. ఆమె మంత్రి పదవిలో ఉన్నందున వివరణ కోరాం. వివరణ ఇచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. చిన్నారెడ్డి సీనియర్ నాయకుడు, పార్టీ లైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టంచేశారు.



# ఆ మిల్లర్లకు ఇదే చివరి అవకాశం

**సివిల్ సప్లయ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరిక**

**బకాయిలు చెల్లించకపోతే డీఫాల్టర్ పీడీ యాక్ట్ పెడుతాం**



**హైదరాబాద్, ఆగస్టు 20 :** వేలం వేసిన ధాన్యం బకాయిలను చెల్లిం చేందుకు మిల్లర్లకు చివరి అవకాశం ఇస్తున్నామని సివిల్ సప్లయ్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. ఈ ఏడాది అక్టోబర్ 31 లోగా మూడు వాయిదాల్లో బకాయిలు చెల్లించాలని ఆదేశించారు. బకాయిలు చెల్లించని మిల్లర్లను డీఫాల్టర్‌గా ప్రకటించడంతోపాటు 25% జరిమానా, 12% వడ్డీతో వసూలు చేస్తామని హెచ్చరించారు. పీడీ యాక్ట్‌లు సైతం నమోదు చేస్తామని, భవిష్యత్తులో ప్రభుత్వం వారికి ధాన్యం ఇవ్వదని తేల్చిచెప్పారు. శాఖాపరంగా చేపట్టిన కఠిన చర్యల వల్ల ఇప్పటి వరకు మొత్తం రూ.వెయ్యి కోట్ల బకాయిలు వసూలైనట్టు తెలిపారు. ఈ మేరకు గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 100 రోజుల కార్యాచరణ ప్రణా ళిక 'మిషన్ కే-100' విజయవంతంగా 50 రోజులు పూర్తి చేసుకొన్నదని, వానకాలానికి (20 26-27) ముందే పెండింగ్‌లో ఉన్న సీఎమ్మార్ తరలింపు, గోదాముల ఖాళీ చేయడం, నిధుల సమీకరణలో కీలక విజయాలు సాధించినట్టు వెల్లడించారు. మిషన్ కే-100 ప్రారం భించిన 50 రోజుల్లో 11.17 లక్షల టన్నుల సీఎమ్మార్ డెలివరీ సాధించినట్టు తెలిపారు. 340 మిల్లులు తిరిగి ప్రారంభమయ్యాయని, ఇప్పటివరకు గింజ డెలివరీ చేయని మిల్లుల సంఖ్య 1,011కి తగ్గిందని చెప్పారు.

## అవి ఆమె వ్యక్తిగతం..
# నాకేం సంబంధం?

**టీపీసీసీ క్రమశిక్షణ కమిటీకి**

**మంత్రి కొండా సురేఖ వివరణ**



**హైదరాబాద్, ఆగస్టు 20 :** తన కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా ఆమె వ్యక్తిగత అభిప్రాయమని, అం దుకు తనను బాధ్యురాలిని చేయడం సహజ న్యాయస్ఫూర్తికి విరుద్ధమని అటవీ, పర్యావ రణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ స్పష్టంచేశారు. కాం గ్రెస్ పార్టీ నాయకత్వం, పార్టీ క్రమశిక్షణ నియమావళి పై తనకు సంపూర్ణ గౌరవం ఉన్నదని పేర్కొన్నారు. టీ పీసీసీ క్రమ శిక్షణ కమిటీ జారీ చేసిన నోటీ సుకు సురేఖ గురువారం వివరణతో కూడిన లేఖను కమిటీ చైర్మన్ మల్లు రవికి పంపారు. అందులో తన వివరణతో స్పష్ట తనిచ్చారు. కుటుంబ బాంధవ్యం కారణంగా ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం, ఆ ప్రాతిపదికన వివరణ కోరడం సముచితం కాదని చెప్పారు.

# కొండా సురేఖ మాజీ ఓఎస్డీపై హత్యాయత్నం కేసు!

**రియల్టర్‌పై ఇనుప రాడ్లతో దాడి చేసిన సుమంత్..**

**బాధితుడి చేయి ఫ్రాక్చర్.. రక్తపు వాంతులు**

**20 రోజుల క్రితం ఘటన.. ఆసుపత్రిలో బాధితుడు.. మేడిపల్లిలో జీరో ఎఫ్ఐఆర్**



**బంజారాహిల్స్, ఆగస్టు 20 :** మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌పై హత్యా యత్నం కేసు నమోదు అయింది. తన పేరిట ఆర్థిక లావాదేవీలు నిర్వహిస్తున్నాడని ఆరోపిస్తూ రియల్టర్‌ను ఒక కార్యాలయానికి పిలిపించి సుమంత్, మరికొందరు కలిసి ఇనుప రాడ్లతో దారుణంగా దాడి చేశారంటూ జూబ్లీహిల్స్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్ చెంగి చర్ల రోడ్డులోని ఆర్టీసీ కాలనీకి చెందిన గొంగిడి హరికృష్ణ రియల్ ఎస్టేట్ వ్యాపారి. జూలై 30న పనిమీద ఊరెళ్లాడు. ఇంటికి తిరిగి వచ్చాక దేవాదాయ శాఖ మంత్రి కొం డా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ దగ్గర్నుంచి అతడికి ఫోన్ వచ్చింది. అర్జంటుగా మాట్లాడాలి అని సుమంత్ చెప్పగా మరుసటి రోజు వస్తానని చెప్పాడు. జూలై 31న హరికృష్ణకు అతని స్నేహితుడు రాము ఫోన్ చేసి జూబ్లీహిల్స్ రోడ్డు నెంబరు 1లో ఉన్న తన కార్యాలయానికి రావాలని సూచించారు. ఈ మేరకు అద్దె కారులో హరికృష్ణ మరో స్నేహితుడు కిరణ్‌తో కలిసి వెళ్లాడు. కార్యాలయంలో రాముతో పాటు సుమంత్ కూడా ఉన్నాడు. 'నా పేరు చెప్పి బయట డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నావు?' అంటూ సుమంత్ తీవ్ర ఆగ్రహంతో హరికృష్ణను నిలదీశాడు. తాను ఎవరి వద్దా డబ్బు వసూలు చేయలేదని హరికృష్ణ సమాధానం ఇచ్చాడు. వినిపించుకోకుండా సుమంత్ దుర్భషలా డుతూ, అక్కడే ఉన్న ఇనుప రాడ్లతో హరికృష్ణ చేతులు, కాళ్లపై దాడి చేశాడని, కొద్ది సేపటికి అక్కడకు వచ్చిన అనుచరులతో హరికృష్ణను చంపేయండి అని చెప్పి వెళ్లిపో యాడని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. సుమంత్ అనుచరులు ప్రశాంత్, అరుణ్ కుమా ర్‌రెడ్డి, కార్తీక్, మహేందర్ రెడ్డి కర్రలు, ఐరన్ రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేయ దంతో పాటు, ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడిలో హరికృష్ణ ఎడమ చేయి విరిగింది. తీవ్ర గాయాలై, రక్తపు వాంతులు కూడా చేసుకున్నాడు. అదే సమయంలో ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు అక్కడికి చేరుకుని బాధితుడిని జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. తీవ్ర రక్తస్రావం అవుతుండటంతో తక్షణ వైద్యం చేయించుకుని వస్తానని చెప్పి బాధితుడు అక్కడి నుంచి ఆసుపత్రికి వెళ్లాడు. గాయపడిన హరికృష్ణ తొలుత గాంధీ ఆసుపత్రిలో, ఆ తర్వాత చెంగిచర్లలోని ఎస్‌వీఎస్ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స పొందాడు. ఎడమ చేయి ఎముక విరగడంతో మెరుగైన చికిత్స కోసం ఉప్పల్‌లోని శ్రీ హెల్త్‌కేర్ ఆసుపత్రిలో చేరగా, వైద్యులు ఆగస్టు 10న శస్త్రచికిత్స నిర్వహించారు. ప్రాణభ యం ఉండటంతో, ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటం వల్ల ఫిర్యాదు చేయలేక పోయిన హరికృష్ణ గురువారం మేడిపల్లి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు సుమంత్‌తో పాటు అతని అనుచరులపై సెక్షన్ 109, 3(5) కింద కేసు నమోదు చేశారు.

# సిమ్‌కార్డులపై పరిమితి

**ప్రతి పౌరుడికి గరిష్టంగా 9.. ఈ నెల 24 నుంచి అమల్లోకి..**



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** పౌరులు ఇకపై ఇష్టమొచ్చినన్ని సిమ్‌లు తీసుకోవడాన్ని కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. ప్రతి పౌరుడికి నిర్దేశించిన గరిష్ఠ పరిమితిలోనే మొబైల్ కనెక్షన్లు ఉండాలని పేర్కొంది. ఇప్పటికే గరిష్ఠ పరిమితిలో కనెక్షన్లు ఉన్న వినియోగదారులకు ఈ నెల 24 నుంచి కొత్త సిమ్‌ల జారీ నిలిపివే యాలని టెలికాం ఆపరేటర్లకు ఆదేశాలు జారీ చేసింది.ఎవరైనా నిర్దేశిత పరిమితిని దాటి సిమ్‌లకు దరఖాస్తు చేస్తే.. వారు గరిష్ఠ పరిమితిని దాటిన విషయాన్ని ఆపరేటర్లు వెల్లడించాలని పేర్కొంది. టెలిఫోన్ కనెక్షన్ల సంఖ్యపై ప్రభుత్వం పరిమితి విధించడం కొత్తేమీ కాదు. ప్రతి పౌరుడికీ గరిష్టంగా తొమ్మిదికి మించి కనెక్షన్లు ఉండరాదన్న నిబంధన ఉంది. జమ్ము-కశ్మీర్, అస్సాం, ఈశాన్య రాష్ట్రాలలో ఈ సంఖ్య ఆరు మాత్రమే. ఫోన్ల కనెక్షన్ సంఖ్యలో ఈ పాత నిబంధననే పాటించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# ముగింపు దశలో ఫాసిస్ట్ పాలన

**డీవైఎఫ్ఐ సదస్సులో ప్రకాశ్‌రాజ్**



**త్రిసూర్(కేరళం), ఆగస్టు 20:** నీట్ ప్రశ్నాపత్రం లీక్‌కు వ్యతిరేకంగా యువత చేస్తున్న నిరసనల నేపథ్యంలో దేశంలో 'ఫాసిస్ట్ పాలన' ముగింపు దశకు చేరుకుందని నటుడు ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యానించారు. అలాంటి శక్తి మళ్లీ అధికారంలోకి రాకుండా చూడాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(డీవైఎఫ్ఐ) రాష్ట్ర సదస్సును గురువా రం నాడిక్కడ ప్రారంభించిన అనంతరం ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ యువత ఇప్పుడు 'వేటగాడిని' గుర్తించిందని అన్నారు. ఇప్పుడు మీ గురించి, మీ పేపర్ లీకేజ్‌ల గురించి మాకు తెలుసని ఈ దేశ యువత ప్రధాని నరేంద్ర మోదీకి చెప్పారని, మొదటిసారి మోదీ అహంకారాన్ని వారు దెబ్బతీశారని ఆయన అన్నారు.

# సహజీవనం కూడా పెండ్లితో సమానం

**ఢిల్లీ హైకోర్టు**




**న్యూఢిల్లీ, ఆగస్టు 20 :** పరస్పర అంగీకారంతో సహజీవనం చేయడం వివాహంతో సమానమని, వారి ఎంపి కలో తల్లిదండ్రులు గానీ, స్నేహితులు గానీ జోక్యం చేసుకోలేరని, లేదా వారి ప్రాణానికి ముప్పు కలిగించలేరని ఢిల్లీ హైకోర్టు తెలిపింది. యువతి కుటుం బం నుంచి బెదిరింపులు ఎదుర్కొంటున్న ఒక సహ జీవన జంటకు జస్టిస్ సౌరభ్ బెనర్జీ పోలీసు రక్షణ కల్పించారు. ఎవరి జోక్యం లేకుండా తమకు నచ్చిన భాగస్వామిని ఎంచుకుని వారితో కలిసి జీవించే పూర్తి హక్కు ఉందని న్యాయ మూర్తి పేర్కొన్నారు.పరస్పర అంగీకారంతో వివాహం చేసుకొనే వయోజనుల కులం, వర్గం, రంగు, మతం లేదా విశ్వాసాలతో సం బంధం లేకుండా వారి వివాహాలు గుర్తింపునకు అర్హమైనవి. కేవలం సామాజిక నైతిక విలువలు, దురభిమానం కారణంగా రాజ్యాంగం కల్పించిన వారి ప్రాథమిక హక్కులను పరిమితం చేయడం అనేది వారి అస్తిత్వాన్ని హరించడమే అవుతుంది అని పేర్కొన్నారు.

# యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

**యాప్‌ల పేరుతో**
**ఎరువులు అందకుండా చేస్తున్నారంటూ రైతుల ఆగ్రహం**

**వాస్తవం : మనోహరాబాద్:**

యూరియా కోసం మనోహరాబాద్ మండలంలోని పలు గ్రామాల రైతులు ఆందోళనకు దిగారు.పంటలకు అవసరమైన యూరియా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మనోహరాబాద్ మండల కేంద్రంలో జాతీయ రహదారిపై గురువారం రైతులు బైఠాయించి నిరసన తెలిపారు.యూరియా అందకపోవడంతో వ్యవసాయ పనులు ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు.యాప్ ల పేరుతో ఎరువులు అందకుండా చేస్తున్నారని రైతులు తీవంగా మండిపడ్డారు.ఎరువుల కోసం రోజుల తరబడి వేచి చూడాల్సి వస్తోందని,అధికారులు సరైన సమాచారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే యూరియా సరఫరా పెంచి రైతులందరికీ అందుబాటులోకి తీసుకురావాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో జాతీయ రహదారిపై కొద్దిసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి యూరియా సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.యూరియా సరఫ రాలో జాప్యం కొనసాగితే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు..



# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**మారెళ్ల భాస్కర్ రెడ్డి**

**వాస్తవం : మద్దూరు**



మద్దూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద మాజీ ప్రధానమంత్రి, దివం గత నేత రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు మారెళ్ల భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భం గా కాంగ్రెస్ నాయకులు రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం కేక్ కట్ చేసారు.ఈ సందర్భంగా మారెళ్ల భాస్కర్ రెడ్డి మా ట్లాడుతూ.. దేశ అభివృద్ధికి, ఆధునిక భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ చేసిన సేవ లు చిరస్మరణీయమని అన్నారు. యువత, విద్యార్థులు, సాంకేతిక రంగానికి ప్రాధా న్యతనిస్తూ దేశాన్ని ఆధునికత వైపు నడిపించారని పేర్కొన్నారు. జయంతిని పురస్కరిం చుకుని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు పండ్లు పంపిణీ చేశాము.ప్రజలకు సేవ చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని, పార్టీ కార్యకర్తలకు అం డగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా విదంగా అవగాహన కల్పిస్తామని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్య కర్తలు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా, మండల నాయకులు సర్పంచులు,నాయకులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్య పరిరక్షణకు
# ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**

మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, ఇందులో భాగంగా మహిళా సంఘాల సభ్యులకు ప్రత్యేక వైద్య శిబిరం ద్వారా 30 రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నామని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం మహిళా సంఘాల సభ్యుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మహిళా సంఘాల సభ్యులతో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ మహిళా సంఘాలు అంటే రుణాలు అందించడం, ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించడం మాత్రమే కాదని, మహిళల గుర్తింపు, సంక్షేమం, సాధికారతతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వడమే లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళ కుటుంబంలోని అన్ని బాధ్యతలను నిర్వర్తిస్తూ, పిల్లల ఆరోగ్యం, కుటుంబ అవసరాలపై ఎంతో శ్రద్ధ చూపుతారని, చాలాసార్లు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై మాత్రం తగినంత శ్రద్ధ చూపరని కలెక్టర్ పేర్కొన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం కూడా క్షేమంగా ఉంటుందని, అందుకే మహిళలు తమ ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి లక్ష్మీనారాయణ, వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ జి ఏంజెలా అల్ఫ్రెడ్, సర్పంచ్ మోహన్, మండల ప్రత్యేక అధికారి శరత్, తహసీల్దార్ షరీఫుద్దీన్ పాల్గొన్నారు.

# దేవాదుల నీరు విడుదల చేయాలి

**ఎమ్మెల్యేను కలిసిన ఇల్లంద రైతులు**



**వాస్తవం : వర్ధన్నపేట**

దేవాదుల నీటిని విడుదల చేసి సాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఇల్లంద గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజును కలిసి వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పోశాల వెంకన్నతో కలిసి రైతులు ఎమ్మెల్యేను కలిసి, దేవాదుల నీరు అందకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు రైతుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు.. రైతుల సమక్షంలో సంబంధిత ఐబీ అధికారులను పిలిపించి దేవాదుల నీటి విడుదల, నీటి లభ్యత తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇల్లంద గ్రామానికి చెందిన రైతులు పోశాల సుధాకర్, గడ్డల సాంబయ్య, పెంచాల శీను, తాళ్లపల్లి గోపి, బొంతల శీను, పాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో లబ్ధిదారుల్లో ఆనందం



**వాస్తవం : మద్దూరు**

మండల పరిధిలోని గాగిళ్లపూర్ గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను గ్రామ సర్పంచ్ ఇట్టబోయిన కనక చంద్రం గురువారం పం పిణీ చేశారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మేక యాదమ్మ,బింగి పోచయ్య, యామ ఉమ రాణి, మేక రమ, గౌండ్ల లింగవ్వ, చెవిటి మానస లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందేలా ప్రభుత్వం చర్యలు తీసు కుంటోందని తెలిపారు. ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు సం తోషం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, గ్రామపంచాయతీ పాలకవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీలు

**వాస్తవం : సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఉత్తర్వులు జారీ చేశారు. ఉపేంద్ర చారి తంగళ్లపల్లి నుండి ఇల్లంతకుంట ఎస్ఐగా, అశోక్ ఇల్లంతకుంట నుండి తంగళ్లపల్లి ఎస్ఐగా, కె. ప్రశాంత్ రెడ్డి, కోనరావుపేట నుండి వేములవాడ రూరల్ ఎస్ఐగా, రామ్మోహన్ వేములవాడ టౌన్ నుండి కోనరావుపేట ఎస్ఐగా,వెంకట్రాజం వేములవాడ రూరల్ నుండి సిరిసిల్ల టౌన్ ఎస్ఐగా బదిలీ చేశారు.

# జైపూర్ మండలంలో ఎంపీడీఓ పర్యటన

**ఓటర్ల జాబితా పరిశీలన, ఇందిరమ్మ ఇండ్ల సమీక్ష**



**వాస్తవం : జైపూర్**

జైపూర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీపతి బాపు రావు గురువారం గంగిపల్లి, ఎల్కంటి, టేకుమట్ల గ్రామపంచాయతీలలో పర్యటించారు.పర్యటనలో భాగంగా గ్రామపంచాయతీల్లో ప్రచురించిన ముసాయిదా ఓటర్ల జాబితాను ఆయన పరిశీలించారు. ప్రతి ఓటరు తమ వివరాలు సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని సూచించారు. పేరు నమోదు కానివారు వెంటనే బూత్ స్థాయి అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.అనంతరం గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలించారు. లబ్ధిదారులు నిర్ణీత గడువులోగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సహాయ ఇంజినీర్ కాంక్ష, టేకుమట్ల సర్పంచ్ బల్ల వెంకటేష్, ఉపసర్పంచ్ గోనె ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శులు ఏ. సత్యనారాయణ, టి. శ్రీనివాస్ మరియు బూత్ స్థాయి సిబ్బంది సుజాత, సరిత తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జీఎఫ్ మండల సెక్రటరీగా ఎం. ధనలక్ష్మి ఏకగ్రీవ ఎన్నిక

**వాస్తవం : ఎల్కతుర్తి**

ఎల్కతుర్తి మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) నూతన సెక్రటరీగా గోపాల్పూర్ జడ్పీహెచ్ఎస్ వ్యాయామ ఉపాధ్యాయురాలు (పీడీ) ఎం. ధనలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గురువారం బావుపేట్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మండలంలోని పాఠశాలల పీడీలు, పీఈటీల సమావేశం జరిగింది. ఎంఈఓ చదువుల సత్యనారాయణ ఆదేశాల మేరకు, బావుపేట్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం ఎల్. మనోహర్ నాయక్ అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో 2026--27 విద్యా సంవత్సరానికి గాను మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీగా ఎం. ధనలక్ష్మిని ఒకేతాటిపై అభ్యర్థులు ఎన్నుకున్నారు. విద్యార్థుల క్రీడా ప్రతిభను వెలికితీస్తా: ఎం. ధనలక్ష్మి ఈ సందర్భంగా నూతన సెక్రటరీ ఎం. ధనలక్ష్మి మాట్లాడుతూ.. మండలంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక కృషి చేస్తానని ప్రకటించారు. క్రీడల్లో మెరుగైన శిక్షణ, అవకాశాలు కల్పించి, విద్యార్థులను మండల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించేలా ప్రోత్సహిస్తామన్నారు. తోటి వ్యాయామ ఉపాధ్యాయుల సహకారంతో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రీడా పోటీలను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆమె పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి. సుధాకర్, టి. రాములు, జి. ప్రేమ్ ప్రసాద్ రావు, బి. స్వరూప, పి. స్వరూప, బి. కిరణ్ రావు, కె. తిరుపతి, జి. శ్రీకాంత్, ఆర్. ఉదయ్, సిహెచ్. పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా



ఎన్నికైన ధనలక్ష్మికి పలువురు ఉపాధ్యాయులు, అధికారులు అభినందనలు తెలిపారు.

# సింగరేణి-ఎస్టిపిపి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



**వాస్తవం : జైపూర్ :** సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని ఎల్కంటి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుండి మంచి స్పందన లభించింది.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో ముందస్తు వ్యాధి నివారణే లక్ష్యంగా ఈ ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఈడి సిహెచ్. చిరంజీవి తెలిపారు. గ్రామ ప్రజలందరూ తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ శిబిరంలో సుమారు 72 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారి అవసరాలకు అనుగుణంగా ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ కిరణ్ పవన్ తెలియజేశారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**వాస్తవం : కోనరావుపేట**

కోనరావుపేట మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మానుక సత్యం ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాజీవ్ గాంధీ దేశానికి ఎనలేని సేవలు చేశాడని భారత ప్రధానిగా దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లి కంప్యూటర్ సేవలు తేవడంతో పాటు,ఆర్థిక సంస్కరణలో నూతన ఒరవడి తీసుకొచ్చారని, దేశ ప్రధానిగా భారత ప్రజల కోసం తన ప్రాణాలు అర్పించాడని సత్యం అన్నారు. అనంతరం సర్ కార్యక్రమంలో భాగంగా ఫామ్ సిక్స్ ను నూతన ఓటర్లకు అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఫిరోజ్ పాషా, అబ్బసాని శంకర్ గౌడ్ , గొట్టె రుక్మిణి, తాళ్లపల్లి ప్రభాకర్ , కాశీరాం, ఎండి అజీమ్ పాషా, పనాల లక్ష్మారెడ్డి, మంథెన మల్లారెడ్డి, బందెల సదానందం, మల్యాల మనోజ్ కుమార్, భాస్కర్, కార్తీక్, రాస రవి,కరెడ్ల రమేష్ రెడ్డి,కొల శ్రీనివాస్,ఇద్దగిరి నరేష్,బెజిగం ధర్మయ్య పాల్గొన్నారు.



# చెన్నూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన గుర్రం నరేష్

**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**

జాతీయ రహదారిపై జరిగిన కార్, బైక్ రోడ్ ప్రమాదంలో కోటపల్లి మండలం వెల్మపల్లి గ్రామానికి చెందిన గుర్రం సురేష్ అనే వ్యవసాయ కూలీకి తీవ్రమైన గాయాలు అయ్యాయి. వెంటనే చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రి అంబులెన్స్ సహాయంతో తీసుకువచ్చినా వెంటనే అత ని పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతనికి ఇప్పటివరకు సుమారు పది లక్షల రూపాయలు కాగా ఇంకో రెండు సార్లు ఆపరేషన్ చేయాలని డాక్టర్ తెలిపారు.దానికి గాను మరో సుమారు పది లక్షలు ఖర్చు అవుతుందని డాక్టలు తెలిపారు.కావున అసలు ప్రమాదం చేసిన వారి పైన పూర్తిగా సమగ్ర విచారణ జరిపి దోషులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం చెన్నూర్ ,కోటపల్లి మండలాల మున్నూరు కాపు సంఘం నాయకులు పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. అతనికి న్యాయం జరిగేదాకా మున్నూరు కాపు సంఘం నాయకులు గుర్రం సురేష్‌కు అండగా ఉరామని లేనియెడల నియోజకవర్గ మున్నూరు కాపు సంఘం నాయకులు రాష్ట్ర నాయకులతో చర్చించి తదుపరి కార్యచరణ గురించి మున్నూరు కాపు సమావేశంలో చర్చించారు.



# పేద విద్యార్థులకు అండగా ఉంటా

### ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వాస్తవం : వర్ధన్నపేట**



పేద విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం వర్ధన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు కళాశాల పరిసరాలను అధికారులతో కలిసి పరిశీలించిన ఎమ్మెల్యే, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలకు 30 కుర్చీలు, 5 టేబుళ్లు, 3 ఉపాధ్యాయుల కుర్చీలను అందజేశారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని త్వరలోనే ఫ్యాన్లు, లైట్లు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు.ప్రభుత్వ విద్యాసంస్థలే విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో అధిక సంఖ్యలో చేరి నాణ్యమైన విద్యను అభ్యసించాలని సూచించారు. అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు.విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు పరిశుభ్రమైన తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ తరగతి గదులు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా ఉపాధ్యాయులు, అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి, కిమా నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరులో ప్రజల కోసం ప్రత్యేక చర్యలు

### మంత్రి వివేక వెంకటస్వామి ఆఫీసులో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు

**వాస్తవం : చెన్నూర్ ఆర్సీ**




ప్రజాల సమస్య పరిష్కారానికి క్యాంపు ఆఫీసులో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఫిర్యా దులు మీ వంతు పరిష్కారం మా వంతు. అంటున్నాడు.చెన్నూరు ప్రజలకు నేరుగా మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు ఛాన్స్ మీదే ..ఎవరి భయం లేకుండా ఏర్పాటు చేసిన బాక్స్ ను వినియోగించుకోండి.నేను అందుబాటులో ఉన్న ప్రజల కొన్ని సమస్యలు. పనులు,వాళ్ళు వచ్చి కలిసి చెప్పుకోవాలన్న టైం కుదరకుండా ఉంది. నా చుట్టూ వందలాది మంది ఉంటున్నారు. వారి దగ్గర సమాచారం మేరకే నాకు అందుతుంది. ఇంకా ఏమైె నా సమస్యలు ఎలాంటి సమస్యలైనా ఉన్నట్లయితే ఫిర్యాదు బాక్స్ చెన్నూర్ క్యాంప్ ఆఫీస్‌లో పెట్టడం జరిగింది. ఫిర్యాదుల పెట్ట తాళం చేయి కూడా నా దగ్గరే ఉంటుంది. మీ ఫిర్యాదులు రాసి ఆ పెట్టెలో వేస్తారని కోరుతున్నాను. ఎల్లవేళలా చెన్నూరులో ఉండటం లేదని భావించి నేను ఈ నిర్ణయం తీసుకున్నాను. ప్రజలు అందరూ కూడా ఏ సమస్యలు ఉన్న మీ సమస్యల అందులో రాసి ఫిర్యాదు పెట్టలో వేయండి అని చె న్నూరు ప్రజలను కోరుతున్నానని మంత్రి వివేక్ తెలిపారు.

# విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
**రూ.47.50 లక్షలతో పాఠశాల ప్రహరీ గోడ,**
**అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన**
**ఖాజిపల్లిలో రూ.13 లక్షలతో**
**ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభం**
**కెమ్ టెక్ పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు**

**వాస్తవం : జిన్నారం**



విద్యా మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని మంత్రికుంట, చెట్లపోతారం ప్రాంతాల్లో రూ. 47.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పాఠ శాల ప్రహరీ గోడ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు గురువారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహి పాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠ శాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఖాజిపల్లి గ్రామంలో రూ. 13 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రజల భద్రత మరింత మెరుగుపడటంతో పాటు నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి పనులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన నిధులను కేటాయించిన కెమ్ టెక్ పరిశ్రమ యాజమాన్యానికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వంతో పాటు పరిశ్రమల సహకారంతో ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహ, ప్రకాష్ చారి, సురేందర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ 82వ జయంతి

### మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్



**వాస్తవం : రామచంద్రపురం**

రాజీవ్ గాంధీ 82వ జయంతి సందర్భంగా రామచంద్రాపురం డివిజన్ రామచంద్రారెడ్డి నగర్ కాలనీ వద్ద ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి రామచంద్రాపురం తాజా మాజీ కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించి వారు చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మాజీ కార్పొరేటర్ పుష్ప నాగేష్ మాట్లాడుతూ భారతదేశాన్ని ఆధునిక సాంకేతిక యుగంలోకి నడిపించిన ఐటి విప్లవ పితామహుడు,18 ఏళ్లకే యువతకు ఓటు హక్కు కల్పించి రాజకీయాల్లో యువశక్తిని భాగస్వామ్యం చేసిన యుగపురుషుడు, పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరా జ్యానికి పునాది వేసిన మహోన్నత నాయకుడు, భారతరత్న, మన మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ అని తెలిపారు. ఆయన ఆశయాలు ఆశీస్సుల బలంతో ప్రజా సేవలో కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో ఎల్లప్పుడూ ముందడుగు వేస్తామని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నవభారత నిర్మాణానికి పునరంకితమవు దామణి తెలిపారు.ఈ కార్యక్రమంలో నాగేష్ యాదవ్, పీటర్, సతీష్, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# కోనారెడ్డి చెరువు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**రైతులకు సాగునీరు అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే నాగరాజు**

**వాస్తవం : వర్ధన్నపేట**

వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని కోనారెడ్డి చెరువు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గురువారం శంకుస్థాపన చేశారు. రూ. 3.14 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచడంతో పాటు నాణ్యత ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. కోనారెడ్డి చెరువు అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేసి వచ్చే ఏడాది కల్లా కాలువల ద్వారా రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ రాజేందర్, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, వర్ధన్నపేట మండల అధ్యక్షుడు పోశాల వెంకన్న, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, ఐనవోలు దేవస్థాన చైర్మన్ ప్రభాకర్ గౌడ్, కౌన్సిలర్లు పాపారావు, వాణి కుమారస్వామి, కిమా నాయక్, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



# జపాన్ పర్యటనకు ఉపాధ్యాయురాలికి ఎన్ఓసీ



**వాస్తవం : మనోహరాబాద్:**

మండల పరిధిలోని రామాయపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మచ్చ రజిత జపాన్ పర్యటనకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా పర్యటనకు వెళ్లేందుకు అవసరమైన ఎన్ఓసీని జిల్లా విద్యాధికారి రాజు గురువారం ఆమెకు అందజేశారు.జపాన్‌లోని విద్యా విధానం,అక్కడ అమలవుతున్న బోధనా పద్ధతులపై అధ్యయనం చేసేందుకు ఎంపికైన ఉపాధ్యాయుల బృందంలో రజితకు అవకాశం లభించింది.ఈ సందర్భంగా డీఈవో రాజు ఆమెను అభినందించి,జపాన్ పర్యటనను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.జపాన్‌లో విద్యా రంగంలో అమలవుతున్న నూతన విధానాలను పరిశీలించి,వాటిని మన విద్యా వ్యవస్థలో అన్వయించేందుకు కృషి చేయాలని కోరారు.తనను జపాన్ పర్యటనకు ఎంపిక చేసినందుకు రజిత కృతజ్ఞతలు తెలిపారు.

# బండ్ల గూడ బాధితులకు న్యాయం చేయాలి

### రైల్వే అధికారులను కోరిన ఎంపీ రఘునందన్ రావు



**వాస్తవం : పటాన్ చెరు**

పటాన్ చెరు డివిజన్ పరిధిలోనీ బండ్లగూడలో రైల్వే స్థలంలో ఇల్లు నిర్మించుకున్నారని,వాటిని కూల్చి వేస్తామని నోటీసులు ఇచ్చిన పేదలకు రైల్వే అధికారులు న్యాయం చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. గురువారం రైల్ నిలయంలో బాధితులతో కలిసి అధికారులకు వినతి పత్రాలను అందజేశారు.ఇళ్లు కట్టుకుని దశాబ్ధాలుగా అక్కడే నివసిస్తున్న వారికి నోటీసులు ఇచ్చి కూల్చివేస్తామని హెచ్చరించడం సరికాదన్నారు.రైల్వే అధికారులు తమ భూమికి హద్దులు పెట్టుకోక పోవడం, రైల్వే ట్రాక్‌ను సైతం తొలగించడంతో ఎన్నో ఏళ్లుగా పేదలు అక్కడ ఇళ్లు కట్టుకుని ఉంటున్నారని అన్నారు. ఒక్కసారిగా వారిని ఇల్లు వదిలి వెళ్లిపొమ్మంటే ఎలా అని ప్రశ్నించారు. బాధితులకు రైల్వే అధికారులు న్యాయం చేయాలని కోరారు. బాధితుల వాదన విని వారికి తగిన అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బండ్లగూడ బాధితులు పాల్గొన్నారు.

# లక్ష్మణ చందా మండలంలోని దేవాలయ నిధుల మంజూరి కొరకై వినతి



**వాస్తవం : లక్ష్మణ చందా**

నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు ఆధ్వర్యంలో లక్ష్మణచందా మండల నాయకులు హైదరాబాద్‌లోని దేవాదాయ శాఖ కమిషనర్ హను మంతరావుని కలిసి లక్ష్మణ చందా మండల కేంద్రంలోని శ్రీ మార్కండేయ ఆలయ ప్రహరీ గోడకి సంబంధించి 14 లక్షల రూపాయలు,మునుపెల్లి గణపతి మందిరానికి ఫ్లోరింగ్ మరియు ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించి 15 లక్షలు పార్‌పెల్లీ శ్రీ కృష్ణ ఆశ్రమ ప్రహరి గోడకి 23 లక్షలు మరియు బాబాపూర్ మల్లన్న స్వామి ఆలయానికి 4 లక్షల రూపాయలు మంజూరు చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. దీనికి సానుకూలంగా స్పందించిన దేవదాయ శాఖ కమిషనర్ త్వరలోనే నిధుల మంజూరుకి హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామి రెడ్డి లక్ష్మణ మండల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ్ర నరేష్ రెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటెల శ్రీనివాస్ సీనియర్ నాయకులు అబ్బడి ప్రతాపరెడ్డి సిరిపురం నాగేష్ బిట్లింగ్ రజనీకాంత్ గుర్రాల లింగారెడ్డి మైనార్టీ మండల అధ్యక్షులు అస్గర్ ఠాకూర్ కిరణ్ తునికి నారాయణ భీమేష్ సిరిపురం ఆనంద్ మంగళ్ పెల్లి గంగాధర్ ఆలుగొట్టు నరేష్ ,గొల్ల మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థనిలు రోల్ మోడల్‌గా ఎదగాలి




**వాస్తవం : వేములవాడ**

వేములవాడ పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఇంటరాక్షన్ ఆఫ్ గర్ల్స్ స్టూడెంట్స్ విత్ రోల్ మోడల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యురాలు డాక్టర్ ఎం సింధు హాజరై విద్యార్థినులతో ముచ్చటించారు.ఈ సందర్భంగా డాక్టర్ సింధు మాట్లాడుతూ.... జీవితంలో రోల్ మోడల్‌గా ఎదగాలంటే ఖచ్చితమైన ప్రణాళికతో పాటు క్రమశిక్షణ ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఆ లక్ష్యం సాధన కోసం ప్రతిరోజు క్రమం తప్పకుండా శ్రమించాలని సూచించారు. చదువులో ఎదురయ్యే సందేహాలను ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బున్నాజీ, ఉపాధ్యాయులు బొజ్జ కృష్ణ, మేడారం హరికృష్ణ, పి. సత్యనారాయణ, బాలరాజు, కె రాధిక, సీహెచ్ అరుంధతి, బాబురాజ్, సరిత, స్వాతి, సవిత, సుచరిత, సునీత, అనిత పాల్గొన్నారు.

జన్మదినోత్సవాలు,
పదవీ విరమణ
శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190



# పేదల పక్షాన పోరుబాట.. బీఆర్ఎస్ ఉద్యమ బాట

**కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కోసం బీఆర్ఎస్ నిరసన కార్యక్రమం**



**వాస్తవం : నిర్మల్ జిల్లా ప్రతినిధి**

నిర్మల్ జిల్లా: లోకేశ్వరం మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు ఆరోపణలకు నిరసనగా మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ జెడ్పి చైర్మన్ ముధోల్ నియోజకవర్గం సమన్వయ సమితి అధ్యక్షుడు లోలం శ్యాంసుందర్, టిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరిపె శ్యాంసుందర్. నాయకులు మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే సంక్షేమ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు అందుతున్న ఆర్థిక సహాయాన్ని వెంటనే అందించాలని కోరారు. పేదల సంక్షేమం కోసం గతంలో అమలైన పథకాలను నిలిపివేయడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి ఎస్ సి ఎస్ మాజీ చైర్మన్ చిన్నా రావు, సర్పంచ్ వెంకటేష్, మాజీ సర్పంచ్ దిగంబర్, ఉప్పు సర్పంచ్ కదారి రాజు, నాయకులు పాల్గొన్నారు

## ప్రిన్సిపాల్ రూపారెడ్డికి నివాళులర్పించిన బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్ ఉపాధ్యాయ బృందం



**వాస్తవం : భూపాలపల్లి**

స్థానిక భూపాలపల్లి పట్టణంలోని బాలాజీ ఇంటిగ్రేటెడ్ టీచింగ్ స్కూల్‌లో ఇటీవల విద్యార్థుల చేతిలో హత్యకు గురైన ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డికి ఉపాధ్యాయ బృందం నివాళులర్పించింది. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం ప్రిన్సిపాల్ రజనీకాంత్ మాట్లాడుతూ.. క్రమశిక్షణలో భాగంగా చెడు మార్గంలో నడుస్తున్న విద్యార్థులను మందలించినందుకు కక్ష పెంచుకుని, మాటు వేసి కత్తితో పొడిచి చంపడం అత్యంత దారుణమైన, బాధాకరమైన విషయమన్నారు. విద్యార్థి లోకం ఏ వైపు వెళ్తుందో అర్థంకాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమశిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు విద్యార్థులను మందలించడం తప్పు కాదన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అశ్లీల దృశ్యాలకు విద్యార్థులు ప్రభావితమవుతున్నారని, తల్లిదండ్రులు పిల్లలను స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియాకు దూరంగా ఉంచే బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు క్రమశిక్షణ కోసం మందలించినప్పుడు తల్లిదండ్రులు కూడా వారికి సహకరించాలని కోరారు. గురువులు విద్యార్థుల మేలు కోరేవారని తెలిపారు. కార్యక్రమంలో బాలాజీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ డాక్టర్ ఏ. రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపాల్ రజినీకాంత్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు. హత్యకు గురైన ప్రిన్సిపాల్ రూపారెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి



**వాస్తవం : చందుర్తి**

కాంగ్రెస్ పార్టీ చందుర్తి మండల శాఖ అధ్యక్షులు గొట్టె ప్రభాకర్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ బస్టాండ్ చౌరస్తా వద్ద గురువారం దివంగత స్వర్గీయ దేశ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొట్టె ప్రభాకర్ మాట్లాడుతూ... చిన్న వయసు లోనే దేశ ప్రధానిగా రాజీవ్ గాంధీ శాస్త్రసాంకేతిక శాటిలైట్, డిజిటల్ ప్రవేశించారని, 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించారని, యవతకు హక్కులు కల్పించారని, అయన మార్గదర్శకాలతో ముందుకుసాగాలి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, ఆత్మ వేములవాడ డివిజన్ కన్వీనర్ ముస్కు ముకుంద రెడ్డి, యూత్ కాంగ్రెస్ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జి న్యాత నవీన్, పార్టీ నాయకులు చింతపంటి రామస్వామి, బొజ్జ మల్లేశం, పులి సత్యం గౌడ్, దూది శ్రీనివాస్ రెడ్డి, సంతపురి బాల్ రెడ్డి, అజయ్ కుమార్, నేతికుంట జలపతి, ధర్మపురి శ్రీనివాస్, ప్రవీణ్, ప్రసాద్, దేవస్వామి, కొలిపాక బాపురెడ్డి, భీమరాజు కనకరాజు, తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొరతపై ఆందోళన చెందొద్దు

**మండల వ్యవసాయ అధికారి స్రవంతి**



**వాస్తవం:మనోహరాబాద్:** మనోహరాబాద్ మండలంలో యూరియా కొరతపై రైతులు జాతీయ రహదారిపై చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి స్పందించి మండల వ్యవసాయ అధికారి స్రవంతి రైతులతో మాట్లాడుతూ యూరియా కొరతపై రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. యూరియా సరఫరాలో ఏర్పడిన సాంకేతిక సమస్యల కారణంగానే తాత్కాలికంగా ఇబ్బందులు ఎదురయ్యాయని పేర్కొన్నారు. మండలంలోని సహకార సంఘాలు, ఎరువుల విక్రయ కేంద్రాల్లో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆమె పేర్కొన్నారు. రైతులకు అవసరమైన మేరకు ఎరువులు సకాలంలో అందించేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు.

## కాటారంలో ఘనంగా రాజీవ్‌గాంధీ 82వ జయంతి



**వాస్తవం : కాటారం**

భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న స్వర్గీయ రాజీవ్‌గాంధీ 82వ జయంతి వేడుకలను గురువారం కాటారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తెప్పల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశాన్ని ఆధునిక సాంకేతిక యుగం వైపు నడిపించడంలో రాజీవ్‌గాంధీ కీలక పాత్ర పోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమళ, డీసీసీ అధిక ప్రతినిధి పంతకాని సమ్మయ్య, మంథని నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్, మాజీ అధ్యక్షుడు వేమూనూరి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు కిషన్ నాయక్, దెబ్బటా రాజేశం, మహేష్ గౌడ్, కాళేశ్వరం దేవస్థానం డైరెక్టర్ బిసుల నర్సయ్య, జాగిరి రాజబాపు గౌడ్, కుమార్ యాదవ్, కుంభం రమేష్‌రెడ్డి, నవీన్‌రావు, నాయని శ్రీనివాస్, రఘురామ్ నాయక్, కొట్టే శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## భూ అక్రమాలపై తక్షణమే స్పందించాలి

**ఎమ్మెల్యేల నిరసన**



**వాస్తవం : నిర్మల్ జిల్లా ప్రతినిధి**

భూభారతిలో జరుగుతున్న అక్రమాలు, 22ఏ భూముల కుంభకోణాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమం చేపట్టారు. గన్ పార్క్ లోని అమరవీరుల స్థూపం నుంచి అసెంబ్లీ వరకు నిరసన చేపట్టారు. ప్రభుత్వ భూములను ప్రొహిబిటెడ్ జాబితా నుంచి మార్చిన వ్యవహారం బయటపడిన తర్వాత. అది కేవలం ఒక 'తప్పిదమే'నంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షమాపణ చెప్పడం అనేక అనుమానాలకు, ప్రశ్నలకు తావిస్తోంది. అని యాదగిరిగుట్టలోని 42 ఎకరాల భూమి వ్యవహారం వెనుక పెద్ద కుట్ర ఉందని స్వయంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నప్పటికీ, ఈ అంశంపై ముఖ్యమంత్రి నుంచి ఇప్పటివరకు ఎందుకు స్పష్టమైన స్పందన రాలేదు.. ప్రభుత్వ భూముల విషయంలో జరుగుతున్న ప్రతి అనుమానాస్పద వ్యవహారంపై పారదర్శకంగా విచారణ జరగాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి నేతృత్వంలో జరిగిన నిరసన ర్యాలీలో ముధోల్ శాసన సభ్యుడు పవార్ రామారావు పటేల్ సహచర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి పాల్గొన్నారు.

## ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు



**వాస్తవం : మద్దూరు**

జనగామ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ధూల్మిట్ట మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కేక్ కట్ చేశారు. అనంతరం బండి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. దేశాన్ని ఆధునిక సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లేందుకు రాజీవ్ గాంధీ చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఐటీ, టెలికమ్యూనికేషన్ రంగాల అభివృద్ధికి ఆయన పునాదులు వేశారని తెలిపారు. యువతకు రాజకీయాల్లో భాగస్వామ్యం కల్పించేందుకు ఓటు హక్కు వయస్సును 18 సంవత్సరాలకు తగ్గించిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని అన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు, జిల్లా నాయకులు, నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రాష్ట్ర విద్యా సదస్సును విజయవంతం చేయాలి



**వాస్తవం : సిరిసిల్ల**

ధర్మ టీచర్ యూనిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి విద్యా సదస్సుకు జిల్లా విద్యాధికారి ఎస్ మొండయ్యని గురువారం కలెక్టరేట్ కాంప్లెక్స్ కార్యాలయంలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు మా ట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే, సాహు మహారాజ్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆలోచన స్ఫూర్తితో ధర్మ టీచర్ యూనిటీని ఏర్పాటు చేసి, విద్యా ప్రజాస్వామ్యీకరణ కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం డీటీయూ జిల్లా కన్వీనర్ సంపతి రమేష్ మా ట్లాడుతూ ధర్మ టీచర్ యూనిటీ ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 26 న రాష్ట్ర స్థాయి విద్యా సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం రాజయ్య, జిల్లా కో-కన్వీనర్ రామస్వామి, జిల్లా కోశాధికారి ఏ కమలాకర్, ఉమ్మడి జిల్లా బాధ్యులు జంగం అంజన్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

## కళ్ళకల్ జాతీయ రహదారిపై రైలు ఇంజిన్



**వాస్తవం: మనోహరాబాద్:**

సాధారణంగా పట్టాలపై పరుగులు తీసే రైలు ఇంజిన్ జాతీయ రహదారిపై దర్శన మివ్వడంతో వాహనదారులు, స్థానికులు ఆసక్తిగా చూశారు. మనోహరాబాద్ మండలం లోని కాళ్లకల్ గ్రామం వద్ద గురువారం ఎన్‌హెచ్--44పై భారీ వాహనంలో రైలు ఇంజిన్‌ను తరలించారు. వాహనంపై ఇంజిన్‌ను ప్రత్యేకంగా అమర్చి తరలిస్తుండగా రహదారిపై కొద్దిసేపు ఆసక్తికర దృశ్యం కనిపించింది. పట్టాలపై పరుగులు తీయాల్సిన ఇం జిన్‌ను ట్రక్కుపై తరలిస్తుండటంతో పలువురు వాహనదారులు ఆగి పరిశీలిం చారు. బెంగళూరులో తయారైన ఈ ఇంజిన్‌ను ఛత్తీస్‌గఢ్‌కు తరలిస్తున్నట్లు నిర్వాహకులు తెలి పారు. గమ్యస్థానానికి చేరుకునేందుకు సుమారు 15 రోజులు పట్టే అవకాశం ఉందని పేర్కొన్నారు. భారీ వాహనం రాకపోకల నేపథ్యంలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా సిబ్బంది రహదారిపై ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన



**వాస్తవం : మద్దూరు**

మండల కేంద్రంలోని రైతు వేదికలో ప్రత్యామ్నాయ పంటల సాగు, ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి బి. రామకృష్ణ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో, వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందన్నారు. తక్కువ నీటితో అధిక ఆదాయం వచ్చే కందులు, పెసర్లు, ఆరుతడి పంటలు, పొద్దుతిరుగుడు సాగు చేయాలని సూచిం చారు. వర్షపు నీటిని ఆదా చేసేందుకు విబిజిరామ్ పథకం కింద నీటి కుంటలు, బోర్ వెల్ రీచార్జి పిట్లు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ మంజుల, ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఏఈవోలు రాజు, కల్పన, అనుష, రైతులు సత్యనారాయణ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా రాజ్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

**జిల్లా 4వ మహాసభల్లో ప్రకటించిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**వాస్తవం :హుస్నాబాద్ :** అఖిల భారత యువజన సమాఖ్య ( ఏఐవైఎఫ్ ) సిద్దిపేట జిల్లా 4 వ మహా సభలు మంగళవారం రోజున హుస్నాబాద్‌లోని అనబేరి సింగిరెడ్డి అమరుల భవనంలో నిర్వహించారు. ఈ మహా సభలకు ఏఐవైఏఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర ముఖ్య అతిధిగా హాజరై జిల్లా కార్యవర్గాన్ని ప్రకటించారు. జిల్లా అధ్య క్షులుగా జనగాం రాజ్ కుమార్, కార్యదర్శిగా కనుకుంట్ల శంకర్‌లను ఏకగ్రీవంగా ఎ న్నుకున్నట్లుగా తెలిపారు. అనంతరం జనగాం రాజ్ కుమార్ మాట్లాడుతూ... రెండవ సారి నాపై నమ్మకంతో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులుగా ఏకగ్రీ వంగా ఎన్నుకున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

వాస్తవం



# మద్యం గ్లాసుల్లో గ్రామాలు కరిగిపోవాల్సిందేనా?

**పంజా విసురుతున్న బెల్ట్‌షాపులు**

**పర్మిట్ రూములను తలపిస్తున్న సిట్టింగ్ రూములు**

**వైన్స్‌లను మించిన బెల్ట్‌షాపుల దందా**

**మద్యానికి బానిసవుతున్న యువతరం**

**వాస్తవం : జగదేవపూర్ : ఆగష్టు 20**

మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల్లో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయన్న ఆరోపణలు ఇప్పుడు కేవలం ఆరోపణలుగా మిగలడం లేదు.. అవి గ్రామాల గుండెల్లో గాయాలుగా మారుతున్నాయి. బెల్ట్‌షాపుల పేరుతో సాగుతున్న ఈ అప్రకటిత వ్యాపారం కుటుంబాల తలుపులు బద్దలు కొడుతూ, జీవనాన్ని మద్యం చుట్టూ బంధిస్తోంది. ఒకప్పుడు వైన్స్ దుకాణాలకే పరిమితమైన మద్యం ఇప్పుడు వీధి చివర, గుడిసె మూల, కూడలి మధ్యలో రాజ్యమేలుతోంది.

**వైన్స్‌లను మించిన బెల్ట్‌షాపుల దందా...**

గ్రామాల్లో బెల్ట్‌షాపులు పెరగడం కాదు.. అవి ఒక వ్యవస్థగా మారిపోయాయి. నిబంధనలు ఎవరి కోసం? అనే ప్రశ్నను ఎగతాళి చేస్తూ, మద్యం ప్రతి ఇంటి గడపకు చేరుతోంది. కొన్ని చోట్ల సిట్టింగ్ రూముల పేరుతో పర్మిట్ రూములకంటే ఘోరమైన వాతావరణం నెలకొంది. అక్కడే తాగడం, అక్కడే తూలడం.. ఇదే కొత్త గ్రామ సంస్కృతిగా మారిపోతుందా అన్న ఆవేదన ప్రజల్లో ఉంది. ఇది అక్రమమా? అనుమతులా? అనే ప్రశ్నకే సమాధానం లేకపోవడం వ్యవస్థ నిద్రపోతుందన్న అనుమానాన్ని బలపరుస్తోంది.

**కుటుంబాలపై కూలుతున్న మద్యం నీడ...**

మధ్యతరగతి, పేద కుటుంబాలు నిశ్శబ్దంగా కూలిపోతున్నాయి. కూలీ డబ్బు కూలీ ఇంటికి చేరకముందే మద్యం గ్లాసుల్లో కరిగిపోతోంది. పిల్లల చదువులు ఆగిపోతున్నాయి.. ఇంటి అవసరాలు ఏడుస్తున్నాయి.. కానీ మద్యం ప్రవాహం మాత్రం ఆగడం లేదు. ఇది కేవలం వ్యసనం కాదు.. ఒక ఆర్థిక విధ్వంసం.

**యువతరంపై పంజా విసురుతున్న మత్తు....**

గ్రామాల భవిష్యత్తు అని చెప్పుకునే యువతే ఇప్పుడు మత్తులో మునిగిపోతుంటే ఎవరు బాధ్యత వహిస్తారు? చిన్న వయసులోనే గ్లాసు పట్టే చేతులు పెరుగుతున్నాయి. ఇది యాదృచ్ఛికమా? లేక వ్యవస్థ అనుమతించిన నిశ్శబ్ద విధ్వంసమా? తల్లిదండ్రుల కళ్లలో భయం పెరుగుతోంది.. కానీ అధికారుల ఫైళ్లలో మాత్రం నిశ్శబ్దం పెరుగుతోంది.ఫిర్యాదులు ఉన్నాయి.. ఆరోపణలు ఉన్నాయి..



కానీ చర్యలు లేవు. ఇదే అసలు కథ. బెల్ట్‌షాపులు ఎవరి అండతో నడుస్తున్నాయి? తనిఖీలు ఎందుకు కాగితాలకే పరిమితమవుతున్నాయి? సిట్టింగ్ రూముల వెనుక ఎవరి నీడ ఉంది? ఇవి ఇప్పుడు గ్రామాల గుండెల్లో మోగుతున్న ప్రశ్నలు.

# కాంగ్రెస్‌ను విమర్శించే అర్హత బీజేపీ నాయకులకు లేదు

**మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు**

**గడ్డం వేణుగోపాల్ రెడ్డి**



**వాస్తవం : మాడుగులపల్లి :** నల్లగొండ జిల్లాలో ఎన్ని మండలాలు ఉన్నాయో తెలియని బీజేపీ నాయకులకు ప్రతిక్షణం ప్రజల సమస్యల పరిష్కారపు కోసం పనిచేసే కాంగ్రెస్ నాయకులను విమర్శించే అర్హత లేదని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గడ్డం వేణుగోపాల్ రెడ్డి మండిపడ్డారు. గురువారం మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సమీకృత ప్రభుత్వ కార్యాలయాల పనుల పురోగతిని స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ జాక్ పాట్‌లో బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిని చేపట్టిన నాగం వర్షిత్ రెడ్డి రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, నల్లమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి పై అవగాహన రహస్యంతో ఆరోపణలు చేయడం మానుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తృణప్రాయంగా మంత్రి పదవిని త్యాగం చేసిన ఘనత కోమటిరెడ్డి వెంకటరెడ్డి అని కోమటిరెడ్డి నాయకత్వంలో నల్లగొండ సమగ్ర అభివృద్ధి సాధిస్తుందన్నారు. మాడుగులపల్లి మండల కేంద్రంలో 7.38 కోట్ల తో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం జూనియర్ కళాశాల నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. మండల ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను ఒకే చోట అందించేందుకు జిల్లాలో ఎక్కడలేని విధంగా 14.70 కోట్లతో సమీకృత ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులను చేపట్టడం జరిగిందన్నారు. బాట బాగుంటేనే బ్రతుకు బాగుంటుంది అని భావించి గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు 30 కోట్లతో మాడుగుల పల్లి వయా చెరువుపల్లి దాచారం తిప్పలమ్మ గూడెం వరకు, మరో 30 కోట్లతో కోయిలపాడు పోయే ఆగ మోత్కూర్ మామిడాల వరకు రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. 65 కోట్లతో మాడుగుల పల్లి వయా మోత్కూరు చిరుమర్తి గోగువారిగూడెం రహదారి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయన్నారు. 48 కోట్లతో చిరుమర్తి పాములపాడు మీదగా టేకుమట్ల లాకుల వరకు రహదారి నిర్మాణం చేయనున్నట్లు వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. మరో 30 కోట్లతో ధర్మాపురం మాచనపల్లి తిప్పర్తి వరకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడం జరిగిందన్నారు. నూతనంగా ఏర్పడిన మాడుగులపల్లి మండలంలో సుమారు 250 కోట్లకు పైగా అభివృద్ధి జరుగుతుంటే ప్రజా సమస్యలు గ్రామాల అభివృద్ధి పై కనీసం అవగాహన లేని బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నాయకులపై అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. రాజకీయ లబ్ధి కోసం బిజెపి నాయకులు అసత్య ఆరోపణలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచ్ల ఫోరం వడ్డే అధ్యక్షుడు సైదిరెడ్డి, మాడ్గులపల్లి సర్పంచ్ ఆరూరి నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దామిడి గోపాలకృష్ణారెడ్డి, కట్టా సిద్ధార్థ రెడ్డి, పుల్లెంల నరసింహ, గౌని నిరంజన్, ఏనుగు జానకిరెడ్డి, కట్టా వెంకట్ రెడ్డి, చల్లా వెంకట్ రెడ్డి, వళ్ళోజు ప్రసాద్, పాల్వాయి శ్రీనివాస్, కొండేటి అంజయ్య, కిన్నెర శ్రవణ్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# బాధిత మహిళలు, చిన్నారులకు భరోసా సెంటర్ ద్వారా సత్వర సేవలు అందించాలి

**భరోసా సెంటర్ కల్పిస్తున్న సేవలపై**

**అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి**

**భరోసా' కేంద్రాన్ని సందర్శించిన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి)**



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఉన్న భరోసా కేంద్రాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే గురువారం సందర్శించి లైంగిక, భౌతిక దాడులకు గురైన బాధితులకు భరోసా సెంటర్లో కల్పించే న్యాయ సలహాలు,సైకలాజికల్ కౌన్సెలింగ్, వైద్య పరంగా తీసుకుంటున్న చర్యలు,మహిళల వేధింపులపై నమోదు అవుతున్న కేసుల వివరాలు తది తర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎస్పీ మహేష్ బి. గితే మాట్లాడుతూ...మహిళల రక్షణకు పోలీస్ శాఖ అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు, చిన్నారులపై వేధింపులు, లైంగిక దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భరో సా సెంటర్ ద్వారా సత్వర సహాయం, న్యాయ పరి రక్షణ తో పాటు మానసిక ధైర్యాన్ని కల్పించడం అత్యంత కీలకమని,భరోసా కేంద్రానికి వచ్చే ప్రతి బాధితులని గౌరవప్రదంగా స్వాగతించి, వారి సమస్యలను పూర్తిగా తెలుసుకుని, సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.భరోసా సెంటర్ అందిస్తున్న సేవలపై విద్యార్థులు, మహిళల్లో మరింత అవగాహన కల్పించేందుకు జిల్లావ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, భరోసా కేంద్రం సేవలను ప్రజలకు మరింత చేరువ చేయాలని భరోసా సెంటర్ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వెంట డిసిఆర్ బి సిఐ మొగిలి, భరోసా సెంటర్ కో-ఆర్డినేటర్ ఎ. శిల్ప, లీగల్ సపోర్ట్ పర్సన్ లహారిక, సపోర్ట్ పర్సన్స్ స్వభావతి, రిచా, రిసెప్షనిస్ట్ మల్లేశ్వరి ఉన్నారు.

# 60 కుటుంబాలకు ఉచితంగా బియ్యం పంపిణీ

**వాస్తవం : ఎల్కతుర్తి**

అవసరంలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో జీల్గుల గ్రామంలో ఉచిత బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. రైస్ లవ్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో టీవీఎస్ రత్న రాజ్ ఆధ్వర్యంలో జీల్గుల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు గోపాల్‌పూర్ ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా మొత్తం 60 కుటుంబాలకు కుటుంబానికి 25 కిలోల చొప్పున బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు కొంతమేర చేయూతనందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీందర్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. సునంద కుమార్, జీల్గుల గ్రామ సర్పంచ్ సృజన, గోపాల్‌పూర్ సర్పంచ్ లక్ష్మీ, శ్రీనివాస్ నాయుడు, అక్షయ్ రాయల్, సందీప్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకుల సేవా కార్యక్రమాన్ని పలువురు అభినందించారు.



# జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అంగన్‌వాడీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రకటన

**వాస్తవం : భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న భూపాలపల్లి, మహదేవ్‌పూర్ సమీకృత శిశు అభివృద్ధి సేవల ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రకటన విడుదల చేశారు. అర్హులైన స్థానిక మహిళా అభ్యర్థుల నుండి అంతర్జాలం ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా ద్వితీయ సంవత్సరం లేదా 12వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అలాగే 01.07.2026 నాటికి 18 నుండి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి. అభ్యర్థులు సంబంధిత అంగన్‌వాడీ కేంద్ర పరిధిలోని గ్రామం లేదా వార్డుకు చెందిన స్థానికులై ఉండటం తప్పనిసరి. పరిశిష్ట కులాలు మరియు పరిశిష్ట తెగలకు కేటాయించిన పోస్టులకు ఆయా గ్రామ లేదా నివాస ప్రాంతం నుండి వచ్చిన అభ్యర్థులు మాత్రమే అర్హులుగా పరిగణించబడతారు. ఎంపిక ప్రక్రియ మొత్తం మార్కుల ప్రాతిపదికన పారదర్శకంగా జరుగుతుంది. ద్వితీయ సంవత్సరం మార్కులకు 70 మార్కులు, ప్రత్యేక విభాగాలైన వితంతువులకు 5 మార్కులు, అనాథలకు 10 మార్కులు, దివ్యాంగులకు 5 మార్కులు కేటాయించారు. దీనితో పాటు జిల్లా ఎంపిక కమిటీ నిర్వహించే ముఖాముఖికి 10 మార్కులు ఉంటాయి. అర్హత కలిగిన మహిళలు 21.08.2026 నుండి 02.09.2026 సాయంత్రం 5:00 గంటల వరకు అధికారిక జాలగూడు ద్వారా అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవచ్చని, నేరుగా లేదా ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులు పరిగణించబడవని జిల్లా ఎంపిక కమిటీ అధికారులు స్పష్టం చేశారు.

# హాస్టల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేసిన చిట్టిబాబు



**వాస్తవం : అందోల్**

అందోల్ జోగిపేట మున్సిపల్ పరిధిలోని 1వ వార్డులోని ఎస్సీ హాస్టల్‌లో బాలికల హాస్టల్లో స్కూల్ బ్యాగులు , షూస్ లు పంపిణీ చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) , ఒకటవ వార్డు కౌన్సిలర్ గడ్డి అరుణ్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని ఎంచుకొని చదువుకోవాలని లక్ష్యంతో చదివితేనే ఉన్నత చదువులు చదువుతారని పేర్కొన్నారు.వార్డెన్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

# ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**డిటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బూర సదానందం**



**వాస్తవం : చందుర్తి**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పిఆర్ సి అమలు, సిపిఎస్ రద్దు, హెల్త్ కార్డ్స్, బదిలీలు తదితర ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని,లేని పక్షంలో అసెంబ్లీని ముట్టడిస్తామని డిమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ బూర సదానందం డిమాండ్ చేశారు.డిటిఎఫ్ చందుర్తి మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుడిమల్ల సురేష్, మెట్ట మహేష్ ఆధ్వర్యంలో గురువారం చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మండలంలోని అన్ని పాఠశాలలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకొని దాదాపుగా 100 మంది ఉపాధ్యాయుల నుండి సభ్యత్వాన్ని తీసుకున్నామని డిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి తెలిపారు.ఈ సందర్భంగా బూర సదానందం మాట్లాడుతూ...2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ పథకం వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మంగళగిరి చక్రపాణి,జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు గుండబోయిన శ్రీనివాస్,రాష్ట్ర కౌన్సిలర్ అంబటి శంకర్,జిల్లా కౌన్సిలర్లు కొమ్ముల జనార్ధన్,ములుకుంట్ల శ్రీనివాస్, గరిపెల్లి వేణుగోపాల్ పాల్గొన్నారు.

# శంకర్‌పల్లిలో ఘనంగా సంకేపల్లి మాజీ సర్పంచ్ లక్ష్మణ్ జన్మదిన వేడుకలు



**వాస్తవం : చేవెళ్ళ**

సంకేపల్లి మాజీ సర్పంచ్ ఎంకేపల్లి లక్ష్మణ్ జన్మదిన వేడుకలు శంకర్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ముఖ్య అతిథిగా హాజరై ఎంకేపల్లి లక్ష్మణ్‌కు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించి, స్వయంగా కేక్ తినిపించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. "ఎంకేపల్లి లక్ష్మణ్ ఎంతోకాలంగా ప్రజలతో మమేకమై పనిచేస్తున్నారు. గ్రామ అభివృద్ధితో పాటు పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవ చేయాలని కోరుకుంటున్నాను. లక్ష్మణ్‌కు ఎల్లప్పుడూ నా సహకారం ఉంటుంది. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు.మండల పార్టీ అధ్యక్షులు బొల్లారం వెంకట్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు చంద్రమౌళి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. మార్కెట్ క మిటీ చైర్మన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కా ర్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎంకేపల్లి లక్ష్మణ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపా రు.ఈ సందర్భంగా నాయకులు లక్ష్మణ్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కల గాలని ఆకాంక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో వేడుకలు ఉత్సాహంగా సాగాయి.

# ముంపు గ్రామం జీఓ వచ్చేవరకు పోరాడుతాం

## జోలలు పట్టి నారాయణపూర్ గ్రామస్తుల నిరసన

### 12 రోజులుగా అక్రమ కేసులపై ఆందోళన
### భిక్షాటన చేస్తూ నిరసన
### ముగ్గురు మహిళలకు అస్వస్థత

**వాస్తవం - గంగాధర ఆగష్టు:20**

గంగాధర మండల కేంద్రంలో నారాయణపూర్ గ్రామస్తులు చేపట్టిన నిరసన వినూత్నంగా సాగింది. తమ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని, తమపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు గత 12 రోజులుగా వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం దాదాపు 100 మంది గ్రామస్తులు జోలలు పట్టుకుని భిక్షాటన చేస్తూ తమ నిరసనను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

**12 రోజులుగా శాంతియుత రిలే నిరాహార దీక్ష పట్టించుకోని ఎమ్మెల్యే మేడిపల్లి**

నారాయణపూర్ గ్రామస్తులపై నమోదు చేసిన కేసులకు వెంటనే ఎత్తివేయాని నిరసనగా 12 రోజులుగా ఆందోళన కొనసాగుతోంది. ఇచ్చిన హామీ నెరవేర్చలని అడిగినందుకు తమ వారిపై అక్రమంగా కేసులు నమోదు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కేసులు ఎత్తివేయడంతో పాటు, తమ గ్రామ భవిష్యత్తుపై ప్ర భుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటివరకు తమ ఆందోళనను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో భిక్షాటన రూపంలో నిరసన చేపట్టాల్సి వచ్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలపై ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఇంతవరకు కన్నెత్తి కూడా చూడలేదని నారా యణపూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశా రు. తమపై ఇంత కక్ష ఎందుకని ప్రశ్నిస్తూ గ్రామ మహిళలు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రజా ప్రతినిధిగా తమ సమస్యను కనీసం వినడానికి కూడా ముందుకు రాకపోవడం బాధాకరమని వారు వాపోయారు.

**జోలలు పట్టుకుని భిక్షాటన**

తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు దాదాపు 100 మంది గ్రామస్తులు జోలలు పట్టుకుని గంగాధర మండల కేంద్రానికి ర్యాలీగా తరలివచ్చారు. మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. “మా గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించండి.. మా సమస్యను పరిష్కరించండి” అంటూ నినాదాలు చేశారు.

**ఎండ తీవ్రతకు ముగ్గురు మహిళలు అస్వస్థత పరామర్శించిన మాజీ ఎంఎల్ఏ సుంకే రవి శంకర్**

నిరసనలో పాల్గొన్న ముగ్గురు మహిళలు ఎండ తీవ్రతతో నీరసించి అస్వస్థతకు గురయ్యారు. వారు ఒక్కసారిగా కిందపడటంతో ఆందోళనకు గురైన గ్రామస్తులు వెంటనే వారిని సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆసుపత్రికి చేరుకుని అస్వస్థతకు గురైన మహిళలను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పడంతో పాటు వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అవసరమైతే కరీంనగర్ ఆసుపత్రికి తరలించాలని వైద్యులకు సూచించారు.




**హామీ అమలు చేయాలని కన్నీటి వేడుకోలు**

ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీకి కట్టుబడి నారాయణపూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని గ్రామ మహిళలు కన్నీటితో వేడుకుంటున్నారు. తమపై నమోదైన కేసులను ఎత్తివేసి, తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. తమ సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామని గ్రామస్తులు స్పష్టం చేశారు. గ్రామస్తులతో మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఎలాంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించాలని సూచించారు.





**నారాయణపూర్ గ్రామస్తుడు రంజిత్ ఆవేదన**

### మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి

“మాది నారాయణపూర్ గ్రామం. మా ప్రస్తుత ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం గతంలో మాకు హామీ ఇచ్చారు. గుడిపై కొట్టేసి మరీ మా గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటిస్తానని చెప్పారు. కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదు. ఇటీవల కురిసిన వర్షాలకు మా గ్రామంలో ఏకంగా ఎనిమిది ఇళ్లు కూలిపోయాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే మరో ఆరు నెలలు లేదా సంవత్సరంలో మా గ్రామంలోని చాలా ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉంది. ఇళ్లు కూలిపోతే మా ఉపాధి పోతుంది.. పనులు కోల్పోతాం.. మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వస్తుంది. మా గ్రామం నుంచి బయటకు వెళ్లడానికి కాసిరెడ్డిపల్లి, చర్లపల్లి వైపు వెళ్లే మార్గాలు కూడా సరిగా లేవు. రోడ్లు బ్లాక్ అయిపోయాయి. మా గ్రామానికి ఆటోలు కూడా సరిగా రావడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లాలన్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితుల్లోనే మేము 12 రోజులుగా నిరసన చేస్తున్నాం. ఈరోజు భిక్షాటన చేస్తూ నిరసన చేపట్టాల్సి వచ్చింది. భవిష్యత్తులో కూడా మా బతుకు ఇలాగే ఉంటే.. భిక్షాటన చేసుకునే పరిస్థితి వస్తుందని ఆవేదనతో ఈ నిరసన చేపట్టాం. ఇకనైనా మా ఎమ్మెల్యే వెంటనే స్పందించాలి. స్వయంగా గ్రామానికి వచ్చి మా సమస్యలను పరిశీలించాలి. ముంపు గ్రామంగా ప్రకటిస్తూ అధికారికంగా



జీఓ తీసుకురావాలి. ప్రభుత్వం నుంచి ముంపు గ్రామం జీఓ వచ్చే వరకు మా నిరసన విరమించేది లేదు. మా ప్రజల పక్షాన నిలబడి, తక్షణమే ముంపు గ్రామంగా ప్రకటించాలని ఎమ్మెల్యేను, ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాను.”

## పెన్షన్ దరఖాస్తులకు ఈ నెల 31 వరకు గడువు

### దరఖాస్తులను స్వీకరించి, ఆన్ లైన్ చేయాలి
### రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**వాస్తవం : రాజన్న సిరిసిల్ల ప్రతినిధి**

చేయూత పెన్షన్ దరఖాస్తుల కోసం ఈ నెల 31 వరకు తుది గడువు అని, దీనిపై క్షేత్ర స్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పెన్షన్ దరఖాస్తుల స్వీకరణ, ఇందిరమ్మ ఇండ్లు, జలసిరి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై జిల్లాలోని ఎంపీడీఓలు, వ్యవసాయ అధికారులు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. చేయూత పెన్షన్ల ప్రక్రియ, దరఖాస్తుల గడువుకు సంబంధించి దరఖాస్తుదారులకు స్పష్టమైన అవగాహన కల్పించాలని, ఈ నెల 31 వ తేదీ పెన్షన్ దరఖాస్తులు సమర్పించేందుకు తుది గడువు అని కలెక్టర్ వెల్లడించారు. మున్సిపాలిటీలు, ఎంపీడీఓ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయించామని పేర్కొన్నారు. వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు(తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా) గీత కార్మికులు, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు మొత్తం ఏడు రకాలకు సంబంధించిన దరఖాస్తులు స్వీకరించాలని, వారు సమర్పించిన పత్రాలు అన్ని నిబంధనల ప్రకారం ఉన్నాయా లేవా అనే వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. వితంతు మహిళలు భర్త మరణ ధ్రువీకరణ పత్రం, ఒంటరి మహిళలు గ్రామాల్లో 30 ఏండ్ల వయసు, పట్టణాల్లో 35 ఏండ్ల వయసు ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలని, వీరికి సంబంధిత పంచాయతీ కార్యదర్శి, వార్డు అధికారులు ధృవీకరణ చేయాలని, గీత కార్మికులు 50 ఏండ్ల వయసు ఉండాలని, ఎక్సైజ్ శాఖ అధికారుల ధ్రువీకరణ పత్రంతో పాటు, గీత కార్మికుల సొసైటీలో సభ్యులుగా ఉండాలని స్పష్టం చేశారు. నేత కార్మికులు 50 ఏండ్ల వయసు ఉండాలని, హ్యాండ్లూమ్ టెక్స్టైల్స్ శాఖ వారి గుర్తింపు పత్రం ఉండాలని తెలిపారు. ఫైలేరియా బాధితులు వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ధ్రువీకరణ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డయాలసిస్ బాధితులు ఆరోగ్యశ్రీ కింద చికిత్స పొందుతున్న వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దివ్యాంగులకు సదరం శిబిరం ద్వారా మంజూరు అయిన 40 శాతం వైకల్య ధ్రువీకరణ యూడీఐడీ పత్రం, చెవిటి వారికి 51 శాతం వైకల్య ధ్రువీకరణ యూడీఐడీ పత్రం ఉండాలని సూచించారు. తల సేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులు కూడా యూడీఐడీ పత్రంతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుకు ఆధార్ కార్డ్, వయసు ధ్రువీకరణ (ఓటర్ కార్డు/జనన ధ్రువీకరణ పత్రము/ విద్యాభ్యాసం ధ్రువీకరణ పత్రం) రేషన్ కార్డ్, తహసీల్దార్ జారీ చేసిన ఆదాయ దృవీకరణ పత్రం, బ్యాంక్ పాస్ బుక్ ఉండేలా చూడాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంతో రూ.5 లక్షలలోపు తక్కువ ఖర్చుతో ఇళ్లను నిర్మించుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి మండలంలో వ్యవసాయ అధికారులు రైతులకు జలసిరి పనులపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులు తమ పొలాల్లో అవసరమైన ఫాంపాండ్స్, బోర్‌వెల్ రీచార్జ్ తదితర నీటి సంరక్షణ పనులను ఈజీఎస్ ద్వారా చేపట్టుకోవచ్చనే విషయాన్ని రైతులకు వివరించాలని అధికారులను ఆదేశించారు. నీటి సంరక్షణకు సంబంధించిన పనులను రైతులు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రైతులకు లాభదాయకమైన పంటల సాగుపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈవీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో, పీడీ హౌసింగ్ వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీఏఓ అఫ్జల్ బేగం, హార్టికల్చర్ అధికారి శరత్, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.



Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
. Editor : MANASANI KRISHNA REDDY

వాస్తవం



# విద్యా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**రూ.47.50 లక్షలతో పాఠశాల ప్రహరీ గోడ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన**

**ఖాజిపల్లిలో రూ.13 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ప్రారంభం**

**కెమ్ టెక్ పరిశ్రమ యాజమాన్యానికి కృతజ్ఞతలు**

**వాస్తవం : పటాన్చెరు**



విద్యా మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజల భద్రతకు పెద్దపీట వేస్తున్నట్లు పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు.గడ్డపోతారం మున్సిపల్ పరిధి లోని మంత్రికుంట, చెట్లపోతారం ప్రాంతాల్లో రూ.47.50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పాఠశాల ప్రహరీ గోడ, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు గురువారం ఉదయం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాల పెంపునకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం ఖాజిపల్లి గ్రామంలో రూ.13 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘా వ్యవస్థను ఎమ్మెల్యే ప్రారంభించారు. సీసీ కెమెరాల ఏర్పాటు ద్వారా ప్రజల భద్రత మరింత మెరుగుపడటంతో పాటు నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి పనులు, సీసీ కెమెరాల ఏర్పాటుకు అవసరమైన నిధులను కేటాయించిన కెమ్ టెక్ పరిశ్రమ యాజమాన్యానికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పరిశ్రమలు తమ సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక ప్రాంతాల అభివృద్ధికి సహకరించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వంతో పాటు పరిశ్రమల సహకారంతో ప్రజలకు మరింత మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమాల్లో గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, మండల విద్యాశాఖ అధికారి విజయ్ కుమార్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహ, ప్రకాష్ చారి, సురేందర్ గౌడ్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిగాచి బాధితులకు అండగా టిపిజేఏసీ



**వాస్తవం : పటాన్చెరు**

సిగాచి ఇండస్ట్రీస్ ప్రమాదం జరిగి 13 నెలలు గడిచినా, పలువురు బాధిత కుటుంబాలకు ఇంకా ఈ పి ఎఫ్ , ఈ డి ఎల్ ఐ ,ఈ ఎస్ ఐ ప్రయోజనాలు అందలేదని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ ) సంగారెడ్డి జిల్లా కమిటీ పేర్కొంది.ఈ నేపథ్యంలో టీపీజేఏసీ జిల్లా ప్రతినిధులు పటాన్‌చెరు ఈ పి ఎఫ్ ఒ ,ఈ ఎస్ ఐ సి కార్యాలయాలను సందర్శించి, సంబంధిత అధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించారు. ఈ పి ఎఫ్ ,ఈ డి ఎల్ ఐ ప్రయోజనాలు పెండింగ్‌లో ఉన్న 13 మంది బాధితుల జాబితాను ఈ పి ఎఫ్ ఒ అధికారులకు,ఈ ఎస్ ఐ ప్రయోజనాలు పెండింగ్‌లో ఉన్న 25 మంది బాధితుల జాబితాను ఈ ఎస్ ఐ సి అధికారులకు అందజేశారు.ఈ సందర్భంగా టీపీజేఏసీ సంగారెడ్డి జిల్లా కన్వీనర్ వై. అశోక్ కుమార్ మాట్లాడుతూ, సిగాచి ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజేష్ కుమార్ చౌదరి విషయంలో కంపెనీ పూర్తి బాధ్యత వహించి, ఆయనకు మెరుగైన వైద్య చికిత్సను అందించడంతో పాటు, నష్టపరిహారంగా రూ.50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బాధిత కుటుంబాలు ఇప్పటికే తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నందున, పెండింగ్‌లో ఉన్న ఈ పి ఎఫ్ , ఈ డి ఎల్ ఐ , ఈ ఎస్ ఐ క్లెయిమ్‌లను అత్యవసరంగా పరిష్కరించి, అర్హులైన బాధితులకు చట్టబద్ధంగా అందాల్సిన అన్ని ప్రయోజనాలను తక్షణమే అందించాలని టి పి జె ఎ సి కోరింది.ఈ కార్యక్రమంలో శ్రీధర్,మహేంద్ర,కో ఆర్డినేటర్ఆర్. లక్ష్మి,కో కన్వీనర్ ఏ.మానస,కో కన్వీనర్ పాల్గొన్నారు.

# బండ్లగూడలో నిరుపేదల ఇండ్లు కూల్చొద్దు

**రైల్వే అధికారులను కోరిన ఎంపీ రఘునందన్ రావు**

**వాస్తవం : పటాన్చెరు**



తమ స్థలంలో ఇల్లు నిర్మించుకున్నారని,వాటిని కూల్చి వేస్తామని నోటీసులు ఇచ్చిన పేదలకు రైల్వే అధికారులు న్యాయం చేయాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.గురువారం రైల్ నిలయంలో బాధితులతో కలిసి అధికారులకు వినతి పత్రాలను అందజేశారు.ఇళ్లు కట్టుకుని దశాబ్దాలుగా అక్కడే నివసిస్తున్న వారికి నోటీసులు ఇచ్చి కూల్చివేస్తామని హెచ్చరించడం సరికాదన్నారు.రైల్వే అధికారులు తమ భూమికి హద్దులు పెట్టుకోక పోవడం,రైల్వే ట్రాక్ ను సైతం తొలగించడం తో ఎన్నో ఏళ్లుగా పేదలు అక్కడ ఇళ్లు కట్టుకుని ఉంటున్నారని అన్నారు. ఒక్కసారిగా వారిని ఇల్లు వదిలి వెళ్లి పొమ్మంటే ఎలా అని ప్రశ్నించారు.బాధితులకు రైల్వే అధికారులు న్యాయం చేయాలని కోరారు. బాధితుల వాదన విని వారికి తగిన అవకాశం ఇవ్వాలని కోరారు.



# ఫిర్యాదులపై సకాలంలో చర్యలు తీసుకోవాలి

**భీమారం పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీ చేసిన మంచిర్యాల డీసీపీ**



**వాస్తవం : చెన్నూరు ఆర్సీ**

వార్షిక తనిఖీలలో భాగంగా ఈరోజు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్, జైపూర్ సబ్‌డివిజన్‌కు చెందిన భీమారం పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఏ.భాస్కర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, వివిధ విభాగాల పనితీరు, కీలక రికార్డులు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన ఫైళ్లు, నమోదైన కేసుల దర్యాప్తు పురోగతి, జజుచీూ నమోదులను క్షుణ్ణంగా పరి శీలించారు. స్టేషన్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ మరియు సిబ్బంది పనితీరుపై సం తృప్తి వ్యక్తం చేసి, సంబంధిత అధికారులు మరియు సిబ్బందిని అభినందిస్తూ పలు కీలక సూచనలు చేశారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు మరియు నమోదైన కేసులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా సకాలంలో విచారణ పూర్తి చేసి పరిష్కరించాలని సూచించారు. జజుచీూలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలనిలిలి ఆదేశించారు. కోర్టులతో సమన్వయంతో పనిచేస్తూ, నమోదైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడే విధంగా నాణ్యమైన, సాక్ష్యాధారాలతో కూడిన దర్యాప్తు చేపట్టాలని సూచించారు.అదేవిధంగా, బాధితులకు రక్షణ మరియు భద్రత కల్పించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారి సమస్యలపై వెంటనే స్పందించి, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ ఎ.వెంకటేశ్వర్ , సీఐ కే.నవీన్ కుమార్, భీమారం ఎస్ఐ రాజేందర్ పాల్గొన్నారు.

# అధునాతన సాంకేతికతపై గీతం అధ్యాపకులకు శిక్షణ



**మ్యాట్ ల్యాబ్‌ను ఉపయోగించి మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ పై కార్యశాల**

**వాస్తవం : పటాన్చెరు**

వేగంగా మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని, బోధన-శిక్షణా నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకుగాను హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ అధ్యాపకులకు మ్యాట్ ల్యాబ్ ను ఉపయోగించి మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ పై మూడు రోజుల ప్రత్యేక కార్యశాలను ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించారు. ఈ వర్క్ షాపును ఆర్కాన్స్ ఇన్, మ్యాథ్ వర్క్స్ ల సంయుక్త సహకారంతో గీతం స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ (జీఎస్సీఈ)లోని ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈఈసీఈ) విభాగం నిర్వహించింది.ఈ కార్యశాలను, మ్యాట్ ల్యాబ్ ఆధారిత మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), డీప్ లెర్నింగ్ (డీఎల్)లో అధ్యాపకులకు ఆచరణాత్మక అనుభవాన్ని అందించడానికి రూపొందించారు. ముఖ్యంగా, గణన భావనలను సమకాలీన ఇంజనీరింగ్, పరిశోధన సమస్యలకు పరిష్కారాలుగా మార్చడంపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక భావనలను ఆచరణాత్మక అమలుతో కలిపి, డేటా-ఆధారిత పద్ధతులను విభిన్న సాంకేతిక రంగాలలో ఎలా అన్వయించవచ్చో అన్వేషించడానికి గీతం అధ్యాపకులకు వీలు కల్పించారు. మ్యాథ్ వర్క్స్ కు చెందిన సీనియర్ ట్రైనింగ్ ఇంజనీర్ డాక్టర్ శుభోబ్రత భట్టాచార్య ఈ కార్యశాలలో ప్రధాన శిక్షకుడిగా వ్యవహరించారు. ప్రత్యేక సాంకేతిక కార్యక్రమాలు, ముఖాముఖి ద్వారా, ఆయన ఇందులో పాల్గొన్న వారికి కీలకమైన మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ భావనలను, అలాగే మ్యాట్ ల్యాబ్ టూల్స్, ఫ్రేమ్ వర్కులను ఉపయోగించి వాటి అమలును పరిచయం చేశారు. ఈ సెషన్లు సమకాలీన గణన విధానాలు, ఇంజనీరింగ్, పరిశోధన, సమస్య-పరిష్కారంలో వాటి వినియోగంపై విలువైన అంతర్దృష్టులను అందించాయి. వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అధ్యాపక బృందం ఈ కార్యశాలలో చురుకుగా పాల్గొని, మ్యాట్ ల్యాబ్, ఫ్రేమ్ వర్కులను ఉపయోగించి మెషిన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ భావనల అభివృద్ధి, అమలు చేయడంలో ఆచరణాత్మక అనుభవాన్ని పొందారు. ముఖాముఖితో ఆచరణాత్మకంగా సాగిన ఈ శిక్షణలో పాల్గొన్నవారికి అంతర్లీన భావనలు, వాటి ఆచరణాత్మక అనువర్తనాలు.. రెండింటిపై అవగాహనను పటిష్టం చేసుకోవడానికి సహాయపడ్డాయి. ఈ కార్యక్రమం యొక్క ముఖాముఖి స్వభావం, పరిశ్రమకు సంబంధించిన టూల్స్, వర్క్ ఫ్లోలను అన్వేషించే అవకాశాన్ని కూడా కల్పించింది. తద్వారా, ఈ సాంకేతికతలను బోధన, పరిశోధన, ఇంజనీరింగ్ అనువర్తనాలకు వర్తింపజేయడంలో ఇందులో పాల్గొన్న వారి విశ్వాసాన్ని పెంచింది.ఈ కార్యశాలను జీఎస్సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ రమేష్ వడ్డి, ఈఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎం. ప్రశాంత రెడ్డి మార్గదర్శకత్వంలో నిర్వహించారు. డాక్టర్ మాధవి తాతినేని, డాక్టర్ ఎం. మరియదాసు ఈ కార్యక్రమాన్ని సమన్వయపరిచి, విజయవంతంగా నిర్వహించేలా చూశారు.

# ఇసుక సరఫరా ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**వాస్తవం : చెన్నూరు ఆర్సీ**

ఎస్.ఎస్.ఎం.ఎం.ఎస్. వెబ్ సైట్ ద్వారా చేపడుతున్న ఇసుక సరఫరా ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్‌లో గల వేలాల ఇసుక రీచ్ ని తహసిల్దార్ వనజ రెడ్డి తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుకను పారదర్శకంగా, అధికారికంగా అందించేందుకు ఎస్.ఎస్.ఎం.ఎం.ఎస్. వెబ్ సైట్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆన్ లైన్ లో ఇసుక బుక్ చేసుకున్న వినియోగదారులకు నిర్ణీత గడువులోగా సరఫరా చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం పర్యవేక్షించాలని, ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారి 163 జి నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్ణీత గడువులోగా పూర్తి చేసే విధంగా అధికారులు పనులను పర్యవేక్షించాలని తెలిపారు.

# అసంపూర్తిగా అంగన్వాడీ కేంద్రం

**ఎలుకల బెడద,పాముల భయం.మట్టిలోనే చిన్నారుల ఆటలు**

**వాస్తవం : హుస్నాబాద్**

హుస్నాబాద్ పట్టణంలోని ఒకటో వార్డులో ఉన్న అంగన్వాడీ కేంద్రం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. చిన్నారులకు పౌష్టికాహారం అందించి, వారి ప్రాథమిక విద్యకు బాటలు వేయాల్సిన కేంద్రం కనీస వసతులు లేక అవస్థలు పడుతోంది. భవనం నిర్మాణం చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.2024లో ఎమ్మెల్యే కోటా నుంచి రూ.6.50 లక్షలు మంజూరు చేసి అంగన్వాడీ కేంద్రం భవన నిర్మాణం చేపట్టినప్పటికీ, పనులు పూర్తికాకుండానే కాంట్రాక్టర్ చేతులెత్తేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవనంలో కనీసం ఫ్లోరింగ్ కూడా ఏర్పాటు చేయకపోవడంతో చిన్నారులు మట్టినేలపైనే కూర్చొని ఆడుకోవాల్సిన దుస్థితి నెలకొంది.ఫ్లోరింగ్ లేకపోవడంతో భవనం కింద ఎలుకలు రంధ్రాలు చేసి లోపలికి వస్తున్నాయని తల్లిదండ్రులు చెబుతున్నారు. అంతేకాకుండా అప్పుడప్పుడు పాములు కూడా అంగన్వాడీ కేంద్రంలోకి వస్తుండటంతో చిన్నారులను కేంద్రానికి పంపాలంటేనే భయపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారుల భద్రతకు ముప్పు పొంచి ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రంలో నిల్వ ఉంచే గుడ్లు, పిండి పదార్థాలు, పౌష్టికాహారాన్ని ఎలుకలు పాడు చేస్తున్నాయని సమాచారం. గర్భిణీలు, బాలింతలు, పసిపిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారం ఇలా వృథా అవుతుండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ, వాటి ఫలితం లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అందకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రానికి వచ్చే చిన్నారులతో పాటు గర్భిణీలు, బాలింతలకు కనీసం మరుగుదొడ్డి సౌకర్యం కూడా లేకపోవడం దారుణమని వార్డు ప్రజలు అంటున్నారు. ఒకవైపు అసంపూర్తి భవనం, మరోవైపు ఫ్లోరింగ్ లేకపోవడం, ఎలుకలు, పాముల బెడద, మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడం వంటి సమస్యలతో కేంద్రం నిర్వహణ ఎలా కొనసాగుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ప్రభుత్వ నిధులతో నిర్మించిన అంగన్వాడీ భవనం అసంపూర్తిగా ఉండటానికి కారణం ఏమిటి..? పనులు మధ్యలోనే నిలిచిపోతే సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదు..? చిన్నారుల భద్రతకు ముప్పు ఉన్నా ఇప్పటివరకు ఎందుకు స్పందించలేదు..? మంజూరైన నిధులు పూర్తిగా వినియోగించారా..? పనులు పూర్తికాకుండానే బిల్లులు చెల్లించారా.. అనే ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.అధికారులు ఇప్పటికైనా స్పందించి అంగన్వాడీ కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని, ఫ్లోరింగ్, మరుగుదొడ్డి, భద్రతా చర్యలు చేపట్టి చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు సురక్షిత వాతావరణం కల్పించాలని వార్డు ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.. సీడీపీఓ సుశీలసమస్యల వలయంలో ఉన్న అంగన్వాడీ కేంద్రం విషయంలో హుస్నాబాద్ సీడీపీఓ సుశీల వివరణ కోరగా కేంద్రంలో సమస్యలు ఉన్న విషయం వాస్తవమేనని, అయితే ఈ విషయాన్ని తమ ఉన్నతాధికారులకు రిపోర్ట్ పంపడంతో పాటు స్థానిక కౌన్సిలర్ చెన్న






బోయిన అనూషవిద్యాసాగర్ దృష్టికి తీసూకెళ్లామని త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

**చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్**

**ప్రధాన కర్యదర్శి శివ శంకర్ గౌడ్**

**బొల్లిగిద్ద సత్యనారాయణ మొయినాబాద్**

**కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్**

**వాస్తవం : చేవెళ్ల**

హిమాయత్ నగర్ చౌరస్తా దగ్గర ఉన్న రాజీవ్ గాంధీ గారి విగ్రహానికి బొల్లిగిద్ద సత్యనారాయణ కాంగ్రెస్ పార్టీ మండల ప్రెసిడెంట్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ ,టిపిసిసి స్పోక్ పర్సన్ గౌరీ సతీష్ మున్సిపల్ అధ్యక్షుడు విక్రం రెడ్డి మాజీ అధ్యక్షులు తమ్మలి మానేయ మండల ఉపాధ్యక్షు లు మరీ రవీందర్ రెడ్డి,మండల కిసాన్ సెల్ అధ్యక్షలు బొక్క వెంకటరెడ్డి పూల మాలలు వేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు భానూరి శివ శంకర్ గౌడ్, చేవెళ్లనియోజకవర్గం కాంగ్రెస్ పార్టి లేబర్ సెల్ప్రధాన కార్యదర్శి మాట్లాడుతు మాజీ ప్రధానమంత్రి, 'భారతరత్న' స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి (సద్భావనా దివస్) ఘన నివాళిభారతదేశాన్ని 21వ శతాబ్దపు డిజిటల్ యుగంలోకి నడిపించిన దార్శనికుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ జయంతి (ఆగస్టు 20) సందర్భంగా ఆయన పవిత్ర స్మృతికి ఘనంగా నివాళులు అర్పిస్తున్నాము. రాజీవ్ గాంధీ జయంతిని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఈ రోజును "సద్భావనా దివస్" (మత సామరస్య దినోత్సవం) గాజరుపుకుంటారు.ముఖ్యమైన ఘట్టాలు ఓ దేశ పురోగతిలో రాజీవ్ గాంధీ పాత్ర సాంకేతిక, టెలికాం విప్లవం భారతదేశంలో కంప్యూటర్, ఐటీ మరియు టెలికమ్యూనికేషన్స్ రంగానికి పునాది వేసి, దేశాన్ని సమాచార విప్లవం వైపు నడిపించిన పితామహుడు రాజీవ్ గాంధీ. యువతకు ఓటు హక్కు: 61వ రాజ్యాంగ సవరణ ద్వారా ఓటు హక్కు కనీస వయస్సును 21 సంవత్సరాల నుండి 18 సంవత్సరాలకు తగ్గించి, దేశరాజకీయాల్లో యువత భాగస్వామ్యాన్ని పెంచిన ఘనత ఆయనదే పిన్న వయస్కుడైన ప్రధాని కేవలం 40 సంవత్సరాల వయస్సులోనే భారత 6వ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టి, అతి పిన్న వయస్సులో ప్రధాని అయిన నాయకుడిగా చరిత్ర సృష్టించారు.పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి: 73, 74వ రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలు మరియు పంచాయతీ రాజ్ వ్యవస్థలకు రాజ్యాంగ బద్ధత కల్పించి, గ్రామాలకు అధికారాలను వికేంద్రీకరించారు. నవోదయ విద్యాలయాలు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించడానికి జవహర్ నవోదయ విద్యాలయాలను (జీపీఎ) ఏర్పాటు చేశారు.ఈ సద్భావనా దివస్ సందర్భంగా, రాజీవ్ గాంధీ ఆశయాలైన జాతీయ సమైక్యత, మత సామరస్యం మరియు దేశ ప్రగతి కోసం ప్రతీ ఒక్కరూ పునరంకితం కావాలని కొరరు మండల కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ మీనాజుద్దీన్ కౌన్సిలర్ అశోక్ యాదవ్ జిల్లా జనరల్ సెక్రెటరీ అనంతరెడ్డి గారు మాజీ ఎంపిటిసి రామ్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దారేది కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షులు గన్నెపాగ నర్సింగ్ రావు మాజీ సర్పంచ్ రాములు కాంగ్రెస్ పార్టీ నాయకులు గణేష్ గౌడ్ జయరాం రెడ్డి గారు బిక్షపతి ముదిరాజు కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు కలిసి విజయవంతం చేసినారు



# మున్సిపల్ కమిషనర్‌ను బదిలీ చేయాలి

**బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మల్లికార్జున్ రెడ్డి**

**బాధితులకు సమాచారం ఇవ్వకుండా కూల్చివేతలు**

**వాస్తవం : హుస్నాబాద్**

మల్లె చెట్టు చౌరస్తా నుండి ఎల్లమ్మ చెరువు వరకు రోడ్డుకు ఇరువైపులా ఇల్లు కోల్పోతున్న ఇంటి యజమానులకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా గోడలు కూల్చివేయడంతో ఇంటి యజమానులు ఆర్థికంగా నష్టపోతున్నారని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి మల్లికార్జున్ రెడ్డి ఆరోపించారు. ఎల్లమ్మ బజార్ రోడ్ లో గల బోడ ఎల్లారెడ్డి ఇంటి నిర్మాణ గోడను మున్సిపల్ అధికారులు ఇష్టం వచ్చినట్లుగా కూల్చివేయడాన్ని ఖండించారు.70 ఫీట్ల వరకు మార్కింగ్ పెట్టిన ప్రకారంగా గోడ నిర్మాణాలను బాధితులు స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారని, కానీ మున్సిపల్ అధికారులు ఇంటి యజమానులకు సమాచారం ఇవ్వకుండా గోడలను కూలగొట్టడంతో ఇంటి యజమానులు నష్టపోతున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మంత్రి పొన్నం ప్రభాకర్ అండ చూసుకొని ప్రజలకు ఇబ్బందులు కలిగే విధంగా నిర్ణయాలు తీసుకోవడంతో మున్సిపల్ ఆదాయానికి నష్టం జరిగే విధంగా వ్యవహరిస్తుండడం మంచిది కాదన్నారు. ఇలాంటి ము న్సిపల్



కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలని కోరారు.ప్రభుత్వం చేసే అభివృద్ధి పనులకు ఎవరు వ్యతిరేకం కాదని ప్రజలకు నష్టం వచ్చే నిర్ణయాలు తీసుకుంటే ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామన్నారు.